www.aksharavelugu.com

RNI: TELTEL/2022/83798

# అక్షర వెలుగు

మంగళ వారం 28.10.2025 | పేజీలు - 8 సంపుటి - 08 | వెల రూ. 5 సంచిక- 301 | హైదరాబాద్ అసోసియేట్ ఎడిటర్ : కవిత పృధ్విరాజ్

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

రిపోర్టర్లు కావలెను

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వెలుబడుతున్న అక్షర వెలుగు దిన పత్రికలో పని చేయాలని అసక్తి కలిగిన అభ్యర్థులు దిగువ చూపబడిన వాట్సప్ నెంబర్‌కు మీ బయోడేటాను పంపవలెను. అనుభవజ్ఞులకు ప్రధాన్యత కలదు.

9581442622

ఏపీలో 7 జిల్లాలకు రెడ్ అలర్ట్, తెలంగాణలోనూ భారీ వర్షాల హెచ్చరిక !

# మోంథా పెను ప్రళయం
# పొంచి ఉన్న భారీ ముప్పు

- తెలంగాణలోనూ భారీ వర్షాల ప్రభావం
- విద్యార్థుల భద్రతే ముఖ్యం: విద్యా సంస్థలకు సెలవులు
- రంగంలోకి అత్యవసర బృందాలు.. అప్రమత్తంగా ఉండాలి



**హైదరాబాద్, అక్టోబర్ 27(అక్షర వెలుగు):** తూర్పు బంగాళాఖాతంలో ఏర్పడిన 'మొంథా' తుఫాను తీవ్ర రూపం దాల్చి పెను తుఫానుగా మారింది. ప్రస్తుతం ఇది తీరం వైపు అత్యంత వేగంగా పయనిస్తోంది. నేడు మధ్యాహ్నం లేదా సాయంత్రం వేళల్లో కాకినాడ, విశాఖపట్నం మధ్య తీరం దాటే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ స్పష్టం చేసింది. తీరం దాటే 3వ

## రాష్ట్రంపై 'మొంథా' ప్రభావం

- మరో మూడు రోజులు నాన్‌స్టాప్ వర్షాలు..
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

'మొంథా' తుఫాను కారణంగా తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణలో వర్షాలపై హైదరాబాద్ వాతావరణ కేంద్రం కీలక అప్‌డేట్ ఇచ్చింది. రాష్ట్రంలో రాబోయే 3వ



## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్

- న్యాయశాఖకు సీజేఐ గవాయ్ సిఫారసు

**ఢిల్లీ , అక్టోబర్ 27(అక్షర వెలుగు):** భారత సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ నియమితులు కానున్నారు. ఈ మేరకు ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, తదుపరి సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్ పేరును కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖకు అధికారికంగా సిఫార్సు చేశారు. సుప్రీంకోర్టులో అత్యంత సీనియర్ న్యాయమూర్తి 3వ

## 'డిజిటల్ అరెస్ట్' మోసాలపై సుప్రీం సీరియస్

- దర్యాప్తు సీబీఐకి బదిలీ అయ్యే అవకాశం
- సుమోటో విచారణ: రాష్ట్రాలకు నోటీసులు
- ఎఫ్ఐఆర్‌ల సమర్పణకు ఆదేశం
- సీబీఐ దర్యాప్తుకు సుప్రీం మొగ్గు



**ఢిల్లీ , అక్టోబర్ 27(అక్షర వెలుగు):** దేశవ్యాప్తంగా అమాయక పౌరులను టార్గెట్ చేస్తూ పెరిగిపోతున్న 'డిజిటల్ అరెస్ట్' మోసాలపై భారత సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. పోలీసులు లేదా న్యాయాధికారు 3వ

## వీధి కుక్కల సమస్యపై సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు

'భారత ప్రతిష్టకు భంగం.. విదేశీయులు కించపరిచేందుకు ఇదే కారణం'



**ఢిల్లీ , అక్టోబర్ 27 (అక్షర వెలుగు):** దేశంలో వీధి కుక్కల దాడులు నిరంతరం పెరుగుతుండటంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ అంశంపై విచారణ సందర్భంగా ధర్మాసనం సంచలన వ్యాఖ్యలు చేసింది. వీధి కుక్కల బెడద భారత ప్రతిష్టను అంత ర్జాతీయ స్థాయిలో దెబ్బతీస్తోందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. వీధి కుక్కల ఉన్మాదం మరియు అవి మానవులపై చేసే క్రూరత్వం గురించి ఏమంటారు అని పిటిషనర్లను ధర్మాసనం ప్రశ్నించింది. కుక్కల దాడులు పెరగడం ఆందోళన 3వ

# డిజిటల్ యుగంలో పెరుగుతున్న ముప్పులు

సాంకేతికత డిజిటల్ యుగంలో సైబర్ సెక్యూరిటీ ప్రాముఖ్యత... సైబర్ సెక్యూరిటీ అంటే ఏమిటి?

- వ్యక్తిగత స్థాయిలో జాగ్రత్తలు
- విద్యా రంగంలో సైబర్ అవగాహన



**హైదరాబాద్, అక్టోబర్ 27 (అక్షర వెలుగు):** ఇప్పటి ప్రపంచం పూర్తిగా డిజిటల్ యుగంలోకి అడుగుపెట్టింది. మనం బ్యాంకింగ్, విద్య, ఆరోగ్యం, ప్రభుత్వ సేవలు అన్నీ ఆన్‌లైన్‌లోనే నిర్వహిస్తున్నాం. టెక్నాలజీ మన జీవితాన్ని సులభతరం చేసింది కానీ అదే సమయంలో కొత్త రకాల ప్రమాదాలను కూడా తెచ్చింది. వీటిలో ముఖ్యమైనది సైబర్ సెక్యూరిటీ. డేటా, డిజిటల్ ఐడెంటిటీ, బ్యాంక్ సమాచారం లాంటి విలువైన సమాచారం ఇప్పుడు హ్యాకర్ల లక్ష్యం అవుతోంది. కాబట్టి ఈ యుగంలో భద్రత 3వ

## రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- రైతు కష్టం వృథా కాదు
- ధాన్యం, పత్తి కొనుగోళ్లపై భువనగిరిలో మంత్రి కోమటి రెడ్డి విస్తృత సమీక్ష
- పత్తి కొనుగోలు, తక్షణ సహాయంపై ప్రాధాన్యత



**భువనగిరి, అక్టోబర్ 27 (అక్షర వెలుగు):** యాదాద్రి భువనగిరి జిల్లా రైతుల సంక్షేమంపై రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సోమవారం ప్రత్యేక దృష్టి సారించారు. భువనగిరి జిల్లా కలెక్టరేట్‌లో ఆయన జిల్లాలోని ఉన్నతాధికారులతో వరిధాన్యం సేకరణ, పత్తి కొనుగోలు మరియు ఇతర రైతుల సమస్యల పరిష్కారంపై విస్తృత సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి జిల్లా వ్యవసాయ, మార్కెటింగ్, సివిల్ సప్లైస్, సహకార, రెవెన్యూ శాఖల అధికారులతో 3వ

## సీక్రెట్ వీడియోలే కొంప ముంచాయి

ప్రియుడిని చంపించి, యాక్సిడెంట్‌గా చిత్రీకరించిన లివ్-ఇన్ పార్ట్‌నర్



**ఢిల్లీ , అక్టోబర్ 27(అక్షర వెలుగు):** ఢిల్లీకి చెందిన యూపీఎస్సీ అభ్యర్థి రమేష్ కేశ్ మీనా (32) అనుమానాస్పద మృతి కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. మొదట అగ్నిప్రమాదం (ఫైర్ యాక్సిడెంట్)గా భావించిన ఈ కేసు, పోలీసుల దర్యాప్తులో హత్యగా తేలింది. రమేష్ తన వద్ద ఉన్న ప్రైవేట్ వీడియోల కోసమే, ప్రియురాలు పక్కా ప్లాన్‌తో ఈ దారుణానికి ఒడిగట్టిందని పోలీసులు వెల్లడించారు. తిమార్‌పూర్‌లోని గాంధీ విహార్‌కు చెందిన 3వ

## తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

మంత్రులు, అధికారుల అధికారిక గృహాల మరమ్మతు ఖర్చుల పరిమితి పెంపు

**హైదరాబాద్, అక్టోబర్ 27 (అక్షర వెలుగు):** తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ అధికారిక గృహాల్లో నివసించే మంత్రులు, ఐఏఎస్, ఐపీఎస్, ఇతర ఉన్నతాధికారుల నివాసాల మరమ్మతుల ఖర్చుల పరిమితులను పెంచుతూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. పెరిగిన కూలీ మరియు మెటీరియల్ 3వ

## నవీన్ యాదవ్ గెలుపుపై మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యూహ రచన



**హైదరాబాద్, అక్టోబర్ 27 (అక్షర వెలుగు):** జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కోసం వ్యూహాన్ని మరింత పదును పెట్టే దిశగా రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక సమావేశం నిర్వహించారు. మంత్రి క్వార్టర్స్‌లో జరిగిన ఈ సమావేశంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని యూసుఫ్‌గూడా డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నేతలు, పలువురు 4వ

## మోదీ కోసం పనిచేస్తున్న రేవంత్

- కట్టింగ్ మాస్టర్‌గా మారిన సీఎం రేవంత్ రెడ్డి
- మోదీ చట్టాలను బీజేపీ పాలిత రాష్ట్రాల కంటే..
- రేవంత్ త్వరగా అమలు చేస్తడు - కేటీఆర్ సంచలన ఆరోపణలు



**హైదరాబాద్, అక్టోబర్ 27 (అక్షర వెలుగు):** తెలంగాణలో నడుస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వం కాదని, కాంగ్రెస్-బీజేపీ కలిసి నడిపిస్తున్న ప్రభుత్వమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. కేంద్రంలోని మోదీ సర్కారు తెచ్చిన చట్టాలను బీజేపీ పాలిత రాష్ట్రాల కంటే కూడా తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి త్వరగా అమలు చేస్తారని ఆయన విమర్శించారు. శంషాబాద్‌లో బీఆర్ఎస్ మైనార్టీ నేతలతో జరిగిన సమావేశంలో కేటీఆర్ పాల్గొని మాట్లాడారు. కేటీఆర్ మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి 'బడే 4వ

## భారత్-చైనా విమాన సేవలు పునఃప్రారంభం

గ్వాంగ్జౌలో ఇండిగో విమానానికి ఘనస్వాగతం



**ఢిల్లీ , అక్టోబర్ 27(అక్షర వెలుగు):** ఐదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత భారత్, చైనా మధ్య విమాన సేవలు తిరిగి ప్రారంభమయ్యాయి. గాల్వాన్ లోయ వద్ద ఉద్రిక్తతల కారణంగా నిలిచిపోయిన ఈ సేవలను పునరుద్ధరిస్తూ, ఇండిగో ఎయిర్‌లైన్స్ కోల్‌కతా-గ్వాంగ్జౌ మధ్య విమానాన్ని నడిపింది. ఈ క్రమంలో, చైనాలోని గ్వాంగ్జౌలో ల్యాండ్ అయిన 4వ

## ఉక్కిరిబిక్కిరి చేస్తున్న ఢిల్లీ కాలుష్యం

ఆసుపత్రులకు పరుగులు తీస్తున్న ప్రజలు



**ఢిల్లీ, అక్టోబర్ 27 (అక్షర వెలుగు):** దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం ఆందోళనకర స్థాయికి చేరుకుంది. నగరంలోని గాలి నాణ్యత సూచీ ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. సోమవారం ఉదయం ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలో ఏక్యూఐ 315గా నమోదైంది, ఇది అత్యంత "అధ్వాన్నమైన" నాణ్యతగా పరిగణించబడుతుంది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ విడుదల చేసిన 4వ

## హైడ్రా ప్రజావాణికి 52 ఫిర్యాదులు
## కబ్జాదారులపై కమిషనర్ దృష్టి



**హైదరాబాద్, అక్టోబర్ 27 (అక్షర వెలుగు):** నగర శివారు ప్రాంతాల్లో జరుగుతున్న ప్రభుత్వ భూములు, చెరువుల ఆక్రమణలు, రోడ్ల కబ్జాలపై హైదరాబాద్ అభివృద్ధి సంస్థ (హైడ్రా) ప్రజావాణి వేదికగా పౌరులు తమ గళం వినిపిస్తున్నారు. ఎక్కడ అక్రమం జరిగినా చూస్తూ ఊరుకోకుండా, ఫొటోలు, వీడియోలతో సహా సాక్ష్యాలను 4వ

కర్నూలు ప్రమాదం ఎఫెక్ట్: ప్రయాణికుల సేఫ్టీకి

## తెలంగాణ ఆర్టీసీ పెద్దపీట

అధికారులకు ఎండీ నాగిరెడ్డి ఆదేశాలు



**హైదరాబాద్, అక్టోబర్ 27 (అక్షర వెలుగు):** కర్నూలు సమీపంలో ఇటీవల ప్రైవేట్ ట్రావెల్ బస్సు ప్రమాదానికి గురై 20 మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన నేపథ్యంలో, తెలంగాణ రాష్ట్ర 4వ

# ఈ సమయంలో ఇటువంటి ప్రచారాలా?


**- 'మొంథా' తుపానుపై అసత్య ప్రచారాలపై పవన్ కల్యాణ్ ఫైర్**



అమరావతి, అక్టోబర్ 27:
ఆంధ్రప్రదేశ్‌ను 'మొంథా' తుపాను సమీపిస్తున్న వేళ, సోషల్ మీడియాలో వ్యాపిస్తున్న అసత్య ప్రచారాలపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విపత్తు సమయంలో ప్రజలను భయాందోళనలకు గురిచేసేలా తప్పుడు సమాచారం వ్యాప్తి చేయవద్దని ఆయన హెచ్చరించారు. తుపాను కారణంగా కాకినాడ పరిసర ప్రాంతాల్లో ఇప్పటికే తీవ్ర ప్రభావం ఉందంటూ కొందరు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. అయితే, ఈ ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని, ప్రస్తుతం కాకినాడలో వాతావరణం ప్రశాంతంగానే ఉందని ఆయన స్పష్టం చేశారు. రేపు రాత్రి ఈ తుపాను రాష్ట్ర తీరాన్ని దాటనుందన్న నేపథ్యంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు. తుపాను పరిస్థితిపై వాస్తవ సమాచారం కోసం ప్రజలు ఆందోళన చెందవద్దని, కేవలం అధికారిక సమాచారంపైనే ఆధారపడాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. కాకినాడ జిల్లా కలెక్టర్, కాకినాడ పోలీసుల అధికారిక సోషల్ మీడియా ఖాతాలను అనుసరించాలని, ఆయా ఖాతాల ద్వారా వెలువడే సూచనలను మాత్రమే పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. విపత్కర సమయాల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, తప్పుడు వదంతులను వ్యాప్తి చేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేయవద్దని పవన్ కల్యాణ్ హితవు పలికారు. ప్రజలందరూ విపత్తు సమయంలో అప్రమత్తంగా ఉండాలని, అధికారులు ఇచ్చే ఆదేశాలను పాటించాలని ఆయన పిలుపునిచ్చారు.

# 'జీరో క్యాజువాలిటీ' లక్ష్యంతో పనిచేస్తున్నాం

**- 40 లక్షల మందిపై తుపాను ప్రభావం అంచనా**
**- రంగంలోకి ఎన్డీఆర్ఎఫ్, అత్యవసర బృందాలు**
**- మంత్రి నారా లోకేశ్**





అమరావతి, అక్టోబర్ 27:
'మొంథా' తుపాను ఆంధ్రప్రదేశ్ తీరం వైపు దూసుకొస్తుండటంతో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా "జీరో క్యాజువాలిటీ" లక్ష్యంతో యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టినట్లు ఐటీ, మానవ వనరులు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ప్రజల భద్రతే తమ ప్రథమ ప్రాధాన్యత అని, ప్రభుత్వ యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 19 జిల్లాల్లో దాదాపు 40 లక్షల మంది ప్రజలు తుపాను ప్రభావానికి గురయ్యే అవకాశం ఉందని అంచనా వేసినట్లు మంత్రి తెలిపారు. వీరి భద్రతను దృష్టిలో ఉంచుకుని, ప్రమాదకర ప్రాంతాల్లోని 1,238 గ్రామాల నుంచి వేలాది మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. బాధితుల కోసం రాష్ట్రవ్యాప్తంగా 1,906 పునరావాస కేంద్రాలను సిద్ధం చేశారు. ముఖ్యంగా 3,465 మంది గర్భిణులు, బాలింతలను గుర్తించి, వారిని సురక్షితంగా ఆసుపత్రులకు తరలించడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు లోకేశ్ వివరించారు. తుపాను ముందస్తు చర్యల్లో భాగంగా 14,798 పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. వాటిలో 364 పాఠశాలలను తాత్కాలిక తుపాను షెల్టర్లుగా మార్చారు. అక్టోబర్ 29 వరకు మత్స్యకారులు వేటకు వెళ్లరాదని, బోటింగ్, బీచ్‌లలో పర్యాటకంపై పూర్తి నిషేధం విధించినట్లు మంత్రి లోకేశ్ వెల్లడించారు. ఈ విపత్తు సమయంలో ప్రజలు కేవలం అధికారిక సమాచారాన్ని మాత్రమే నమ్మాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సహాయక చర్యల కోసం ఇప్పటికే 11 ఎన్డీఆర్ఎఫ్ 12 ఎస్డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దించారు. అగ్నిమాపక సిబ్బంది, బోట్ బృందాలు, చెట్లను తొలగించే బృందాలను అవసరమైన రక్షణ పరికరాలతో సిద్ధం చేశారు. అత్యవసర వైద్య సేవలకు 325 మెడికల్ క్యాంపులు, 876 ఆరోగ్య తక్షణ స్పందన బృందాలు, 108, 104 అంబులెన్సులను సిద్ధం చేశారు. అదనంగా, మూడు బోట్ క్లినిక్‌లను కూడా క్రియాశీలకం చేశారు. తుపాను అనంతరం విద్యుత్ పునరుద్ధరణ కోసం 772 బృందాలను 11,347 స్తంభాలు, 1,210 ట్రాన్స్‌ఫార్మర్లతో సిద్ధంగా ఉంచారు. రహదారులపై అడ్డంకులను తొలగించడానికి 7,289 యంత్రాలు, తాగునీటి సరఫరాకు 1,521 ట్యాంకర్లు, 1,037 జనరేటర్లను ఏర్పాటు చేశారు. కమ్యూనికేషన్ వ్యవస్థకు అంతరాయం కలగకుండా 16 శాటిలైట్ ఫోన్లు, 35 డీఎంఆర్ సెట్లు, 10 మొబైల్ నెట్‌వర్క్ టవర్లను కీలక ప్రాంతాల్లో మోహరించారు. ప్రధానమంత్రి కార్యాలయం, ఆర్మీ, ఎన్డీఎంఏ, పొరుగు రాష్ట్రాలతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు చేపడుతున్నట్లు మంత్రి నారా లోకేశ్ వివరించారు.

# ఫేక్ ప్రచారానికి వైసీపీ దిగజారుడు రాజకీయం

**- నిన్న గురుకుల పాఠశాల.. నేడు రోడ్లు**
**- కఠిన చర్యలు తప్పవు: మంత్రి హెచ్చరిక**
**- రోడ్ల పరిస్థితిపై నారా లోకేశ్ ఫైర్**

రోడ్ల పరిస్థితికి సంబంధించి సోషల్ మీడియాలో జరుగుతున్న ఫేక్ ప్రచారాలపై ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వైసీపీ నాయకులను 'హ్యాబిచ్యువల్ అఫెండర్స్' (పదేపదే నేరాలకు పాల్పడేవారు)గా అభివర్ణించిన లోకేశ్, మరోసారి ఫేక్ ప్రచారానికి దిగారని విమర్శించారు. ఏపీలో రోడ్ల పరిస్థితి అంటూ వేరే రాష్ట్రానికి చెందిన పాత ఫోటోలతో అసత్య ప్రచారం చేయడం వైసీపీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. వైసీపీ పేటీఎం బ్యాచ్ తప్పుడు ప్రచారానికి ఉపయోగించిన ఫోటోకు సంబంధించిన వాస్తవాలను లోకేశ్ వెల్లడించారు. రోడ్డుపై నడుస్తున్న ఓ స్కూల్ బాలికపై బురద పడినట్లు ఉన్న ఆ ఫోటో వాస్తవానికి గుజరాత్ రాష్ట్రానికి చెందినదని తెలిపారు. పాఠశాలలు ఉన్న ప్రాంతాల్లో సురక్షిత డ్రైవింగ్‌పై ప్రజలను చైతన్యపరిచేందుకు గుజరాత్‌కు చెందిన ఓ ఐఏఎస్ అధికారి 2022లో ఈ పోస్టు చేశారని, దాన్ని తీసుకువచ్చి ఏపీకి ఆపాదించారని ఆయన వివరించారు.- నిన్న గురుకుల పాఠశాల.. నేడు రోడ్లు ఇలాంటి అసత్య ప్రచారాలు గతంలో కూడా జరిగాయని లోకేశ్ గుర్తు చేశారు. నిన్న గురుకుల పాఠశాలకు సంబంధించిన ప్రచారంలోనూ ఇలాంటి తప్పుడు సమాచారమే ఇచ్చారని, నేడు రోడ్ల పరిస్థితి పేరుతో మరోసారి తప్పుడు ప్రచారం చేశారని ఆయన విమర్శించారు. ఇలాంటి దుష్ప్రచారాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. - కఠిన చర్యలు తప్పవు: మంత్రి హెచ్చరిక తప్పుడు ప్రచారం ద్వారా ప్రజలను, ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తున్న వైసీపీ పేటీఎం బ్యాచ్‌పై కఠిన చర్యలు తప్పవని మంత్రి నారా లోకేశ్ హెచ్చరించారు. విపత్కర పరిస్థితుల్లో కూడా రాజకీయ లబ్ధి కోసం అబద్ధాలను ప్రచారం చేయడం మానుకోవాలని ఆయన హితవు పలికారు.

# కర్నూలు బస్సు ప్రమాదం

**- డీఎన్ఏ పరీక్షల అనంతరం 20 మృతదేహాల గుర్తింపు, కుటుంబ సభ్యులకు అప్పగింత**

కర్నూలు, అక్టోబర్ 27:
కర్నూలు జిల్లాలోని చిన్న టేకూరు శివారు 44వ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో అగ్నికి ఆహుతై మరణించిన 20 మంది మృతదేహాల గుర్తింపు ప్రక్రియ పూర్తయింది. ఈ ప్రమాదంలో మృతదేహాలు గుర్తుపట్టలేని విధంగా కాలిపోవడంతో, వాటి మాంసపు ముద్దలను, బాధిత కుటుంబ సభ్యుల రక్త నమూనాలను సేకరించి డీఎన్ఏ పరీక్షలు నిర్వహించారు. డీఎన్ఏ పరీక్షల అనంతరం మృతదేహాలను ఆదివారం వారివారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రకటించిన ఎక్స్‌గ్రేషియా చెక్కులను బాధిత కుటుంబాలకు అందజేశారు. అనంతరం మృతదేహాలను అంబులెన్స్‌లలో వారి స్వస్థలాలకు తరలించారు. ఈ ప్రమాదంలో మరణించిన 20 మందిలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారు ఆరుగురు ఉన్నారు.



**- మృతుల్లో తెలంగాణకు చెందిన బాధితులు:**

చందన మంగ, తండ్రి శ్రీవలీబ్‌గౌడ్ మంగ, శ్రీనివాసనగర్, హెచ్‌ఎంటీ రోడ్, హైదరాబాద్.
సంధ్యారాణి, హెచ్‌ఎంటీ రోడ్, హైదరాబాద్.
మేఘనాథ్, శ్రీనివాసనగర్, కోదాడ.
అనూష, వస్త కొండూర్, గుండాల మండలం, నల్లగొండ జిల్లా.
బొంత ఆదిశేషగిరిరావు, సాయి దత్తా ఎన్‌క్లేవ్, హైదర్‌గూడ, రంగారెడ్డి జిల్లా.
కీనుగ దీపక్ అంబదాల, రాయగఢ్.

**మద్యం మత్తులో బైక్ ప్రమాదం:**

ఇదిలా ఉండగా, కర్నూలు జిల్లా లెందకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో చిన్న టేకూరు వద్ద జరిగిన మరో బైక్ ప్రమాదానికి సంబంధించిన వివరాలను ఎస్పీ కార్యాలయం వెల్లడించింది. ఈ ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి శివశంకర్ మద్యం మత్తులో ఉండి బైక్ నడుపుతూ ప్రమాదానికి గురైనట్లు ఆర్ఎఫ్ఎస్ఎల్ నివేదిక ద్వారా తేలిందని, మృతుడి విస్సేరా నమూనాలో మద్యం ఆనవాళ్లు ఉన్నట్లు నిర్ధారించారని ప్రకటనలో తెలిపారు.



# నకిలీ మద్యం మాఫియా చంద్రబాబు మనుషులదే'

**- నకిలీ ఫ్యాక్టరీలు, బెల్ట్ షాపులు చంద్రబాబు మనుషులవే - వైసీపీ అధికార ప్రతినిధి ఆరె శ్యామల సంచలన ఆరోపణలు**

అమరావతి, అక్టోబర్ 27:
నకిలీ మద్యం తయారీ, సరఫరా వెనుక టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు మనుషులు, మాఫియా హస్తం ఉందని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరె శ్యామల సంచలన ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో నకిలీ మద్యం సరఫరా కళ్ల ముందు కనిపిస్తున్నా ఎవరూ నోరు తెరిచి మాట్లాడటం లేదని ఆమె తీవ్రంగా విమర్శించారు. నకిలీ ఫ్యాక్టరీలు, బెల్ట్ షాపులు చంద్రబాబు మనుషులవే "నకిలీ మద్యం ఫ్యాక్టరీలు నడిపేది చంద్రబాబు మనుషులే. ప్రైవేట్ లిక్కర్ షాపులకు, బెల్ట్ షాపులకు ఈ నకిలీ మద్యాన్ని సరఫరా చేస్తూ, మాఫియాలో భాగమైనది కూడా చంద్రబాబు మనుషులే. కానీ,




ఈ అక్రమాలు ఎప్పుడైనా బయటపడితే, దొరికితే మాత్రం తమకు ఏమీ సంబంధం లేదన్నట్టుగా పక్క పార్టీల వారిపై నెట్టి పారేస్తారు" అని ఆరె శ్యామల ఆరోపించారు. కర్నూలు జిల్లాలో బైక్ ప్రమాదంలో మరణించిన శివశంకర్ మృతిని ప్రస్తావిస్తూ, ఆ సమయంలో అతనికి మద్యం అందుబాటులో ఉండకపోయి ఉంటే ఈ విషాదం రాష్ట్రంలో ఉండేది కాదని ఆమె అన్నారు. ఈ తరహా విషాద సంఘటనలకు రాష్ట్రంలో జరుగుతున్న నకిలీ మద్యం సరఫరా పరోక్షంగా కారణమవుతోందని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ అక్రమ మద్యం మాఫియాపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

# అయ్యో బాబోయ్.. టెట్ ఫీజు చూసి గుడ్లు తేలేస్తున్న నిరుద్యోగులు!

అమరావతి, అక్టోబర్ 27:
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ విడుదల చేసిన టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ నోటిఫికేషన్‌లో దరఖాస్తు ఫీజు భారీగా పెంచడంపై నిరుద్యోగ అభ్యర్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఒక్కో పేపర్‌కు రూ.750గా ఉన్న ఫీజును ఈసారి ఏకంగా రూ.1000 చొప్పున నిర్ణయించడంతో, అభ్యర్థులు జేబులకు చిల్లులు పడుతున్నాయని లబోదిబోమంటున్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ అక్టోబర్ 24న ప్రారంభమైంది. అర్హత కలిగిన అభ్యర్థులు నవంబర్ 23, 2025వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. నిరుద్యోగులతో పాటు, 2011కు ముందు ప్రభుత్వ పాఠశాలల్లో నియమితులైన ఇన్-సర్వీస్ టీచర్లు సైతం టెట్ పరీక్ష రాయాల్సి ఉంటుందని విద్యాశాఖ నోటిఫికేషన్‌లో స్పష్టం చేసింది.

**- ఒక్కో పేపర్‌కు రూ.1000 ఫీజు:**

టెట్ పరీక్షలో పేపర్ 1 ఏ, పేపర్ 1 బి, పేపర్ 2 ఏ, పేపర్ 2 బి.. మొత్తం నాలుగు పేపర్లు ఉంటాయి. ఈసారి ప్రభుత్వం ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున ఫీజు చెల్లించాలని పేర్కొంది. దీని ప్రకారం, ఒక అభ్యర్థి రెండు పేపర్లకు దరఖాస్తు చేసుకుంటే, పరీక్ష ఫీజుగా ఏకంగా రూ.2,000 చెల్లించాల్సి వస్తుంది. ఎన్ని పేపర్లు రాస్తే అన్నింటికీ విడిగా ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. టెట్ పరీక్షలను డిసెంబర్ 10న రాష్ట్రవ్యాప్తంగా పలు పరీక్ష కేంద్రాల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు షిఫ్టుల్లో ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నారు. ఈ పరీక్షల ఫలితాలు వచ్చే ఏడాది జనవరి 19న వెలువడనున్నాయి. నోటిఫికేషన్, షెడ్యూలు, సిలబస్ వంటి వివరాల కోసం అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్‌ను చూడవచ్చు. ఏవైనా సందేహాలుంటే టెట్ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి సూచించిన ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చు.



# రైల్వే ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు స్పెషల్ ఫోకస్

**- పురోగతిపై సమీక్ష, అధికారులకు కీలక సూచనలు**

అమరావతి, అక్టోబర్ 27:
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని రైల్వే ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా, ఏపీ సచివాలయంలో సంబంధిత అధికారులతో సోమవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించి, రైల్వే ప్రాజెక్టుల పనుల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులకు ముఖ్యమంత్రి కీలక సూచనలు చేశారు. ఈ సమీక్షా సమావేశానికి మంత్రి బీసీ జనార్దన రెడ్డి, రైల్వే శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ శ్రీవాస్తవ, తూర్పు, దక్షిణ కోస్తా రైల్వే అధికారులు హాజరయ్యారు. ఏపీలో రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి తక్షణం చేపట్టాల్సిన చర్యలు, అలాగే రైల్వే శాఖ దృష్టికి తీసుకెళ్లాల్సిన అంశాలపై ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రధానంగా చర్చించారు. ముఖ్యంగా, నడికుడి - శ్రీకాళహస్తి, గుంటూరు - గుంతకల్, గుణదల, ముస్తాబాద్ బైపాస్, రాయదుర్గ్ - తుముకూరు మధ్య రైల్వేలైన్ ప్రాజెక్టుల



పురోగతిపై సమీక్షలో వివరంగా చర్చించారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో రూ.33,630 కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టుల పనులు పురోగతిలో ఉన్నాయని, వాటిని వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. రాష్ట్రంలో కొత్త రైల్వేలైన్లు, అమృత్ భారత్ స్టేషన్ల అభివృద్ధి, రైల్వే ఓవర్, అండర్ బ్రిడ్జిల నిర్మాణాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రైల్వేశాఖకు ప్రతిపాదనలు పంపించిందని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయడం ద్వారా రాష్ట్ర అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని ఆయన ఆకాంక్షించారు

# దుర్గగుడి పవిత్రతను కాపాడండి

**- ఆలయ పరిధిలో రాజకీయ విమర్శలు తగవు - పాలక మండలి సూచన**

విజయవాడ, అక్టోబర్ 27:
విజయవాడ కనకదుర్గ మల్లేశ్వర స్వామి ఆలయ పాలకమండలి సభ్యులు రాజకీయ నాయకులకు, పార్టీలకు కీలక హెచ్చరిక చేశారు. పవిత్రమైన ఇంద్రకీలాద్రి ఆలయ ప్రాంగణంలోకి రాజకీయాలను తీసుకురావద్దని, ఇక్కడ ఎలాంటి రాజకీయ ఉపన్యాసాలు గానీ, ఆరోపణలు గానీ చేయకూడదని వారు గట్టిగా విజ్ఞప్తి చేశారు. ఆలయ ప్రాంగణం, ఘాట్ రోడ్డు, కామధేను అమ్మవారి ఆలయం, కనకదుర్గానగర్ సమీప ప్రాంతాలలో రాజకీయ విమర్శలకు, అంశాలకు



ఎట్టి పరిస్థితుల్లోనూ తావు ఇవ్వరాదని పాలకమండలి సభ్యులు స్పష్టం చేశారు. ఆలయ పవిత్రతను, ఆధ్యాత్మిక వాతావరణాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని వారు నొక్కి చెప్పారు. దేవాలయాలను రాజకీయ కార్యకలాపాలకు వేదికగా మార్చే ప్రయత్నాన్ని ఏమాత్రం సహించబోమని పాలకమండలి తెలియజేసింది. ఈ మేరకు ఇంద్రకీలాద్రి దేవస్థానం పాలకమండలి సభ్యులు అందరి రాజకీయ పక్షాలకు ఇదే తమ కీలక విజ్ఞప్తిగా ఒక ప్రకటనను విడుదల చేశారు.

# నార్కో టెస్ట్‌కు సిద్ధం.. దమ్ముంటే రండి

**- నకిలీ మద్యం ఆరోపణలపై దుర్గమ్మ సాక్షిగా జోగి రమేశ్ సవాల్**

అమరావతి, అక్టోబర్ 27:
నకిలీ మద్యం కేసులో తనపై వస్తున్న ఆరోపణలను బలంగా ఖండిస్తూ వైసీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్ సోమవారం విజయవాడలోని కనకదుర్గమ్మ ఆలయంలో సత్యప్రమాణం చేసి, తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకునే ప్రయత్నం చేశారు. తిరుపతి వెంకన్న, బెజవాడ దుర్గమ్మపై ప్రమాణానికి కట్టుబడి ఉన్నానని, అందులో భాగంగానే ఇప్పుడు ప్రమాణం చేశానని జోగి రమేశ్ తెలిపారు. ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని జోగి రమేశ్ ప్రశ్నించారు. "నాపై తప్పుడు ఆరోపణలు చేసిన వారు సత్యప్రమాణానికి సిద్ధమా? కనీసం లైడిటెక్టర్ టెస్టుకైనా వచ్చే దమ్ముందా? కనకదుర్గమ్మ సాక్షిగా నేను తప్పు చేసినట్లు నిరూపించాలి" అని ఆయన సవాల్ విసిరారు.

## సంపాదకీయం

### ప్రకృతి వైపరీత్యమా లేక

# మానవ నిర్లక్ష్యమా?

ప్రతి సంవత్సరం వర్షాకాలం వచ్చినప్పుడల్లా దేశంలోని ప్రధాన నగరాలు నీట మునిగిన దృశ్యాలను మనం చూస్తూనే ఉన్నాం. చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, ముంబై, ఢిల్లీ వంటి మహానగరాలు వరదలతో అతలాకుతలం అవుతుండడం ఇక కొత్త విషయం కాదు. కానీ ప్రశ్న ఏమిటంటే ఇవన్నీ నిజంగా ప్రకృతి వైపరీత్యాలేనా? లేక మానవ అజాగ్రత్త, నిర్లక్ష్యం, అసంఘటిత పట్టణ ప్రణాళికల ఫలితమా? వాస్తవం ఏమిటంటే, నగర వరదలు ఇప్పుడు ప్రకృతికి కంటే మన వ్యవస్థల వైఫల్యానికి సాక్ష్యంగా నిలుస్తున్నాయి. చెన్నై 2015 వరదలను ఎవరు మరచిపోతారు? కొన్ని రోజుల్లోనే రికార్డు స్థాయిలో వర్షం పడడంతో నగరం జలప్రళయాన్ని చూశింది. కానీ తర్వాతి పరిశోధనల్లో బయటపడిన నిజాలు ఒక్కటే చెబుతున్నాయి ౼ ఆ విపత్తుకు కారణం కేవలం వర్షపాతం కాదుబీ నగరంలోని చెరువులు, వాగులు, నాళాలు ఆక్రమించబడడం. ఒకప్పుడు నీటి మార్గాలుగా ఉన్న చోట్ల ఇప్పుడు భవనాలు, షాపింగ్ మాల్స్, రోడ్లు నిలిచిపోయాయి. నీరు తన సహజ మార్గాన్ని వెతుక్కుంటూ ఇళ్ళలోకి ప్రవేశించింది. అదే దృశ్యం 2020 తర్వాత హైదరాబాద్‌లో, 2022లో బెంగళూరులో కూడా పునరావృతమైంది. హైదరాబాద్ వంటి నగరాల్లో "మూసి" నది ఒకప్పుడు జీవనాధారం. ఇప్పుడు అది కాలుష్యపు నదిగా మారిపోయింది. వర్షం పడగానే పాత బస్తీ ప్రాంతాలు మొదట మునుగుతాయి. కారణం - డ్రైనేజ్ వ్యవస్థ పాతబడిపోయి ఉండటం, నాళాలపై ఆక్రమణలు, ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల నీరు ఆగిపోవడం. నగరాభివృద్ధి పేరుతో ప్రతి అంగుళం భూమి నిర్మాణాల కోసం ఉపయోగించబడుతోంది. నీలం రంగులో కనిపించే చెరువులు గూగుల్ మ్యాప్‌లో మాత్రమే మిగిలిపోయాయి. నగర ప్రణాళికల్లో "నీటి ప్రవాహ దారులు" అనే మాట లేని పరిస్థితి. బెంగళూరు పరిస్థితి కూడా అంతే. ఒకప్పుడు "సరస్సుల నగరం"గా పేరు గాంచిన బెంగళూరు, ఇప్పుడు వరదల నగరంగా మారిపోయింది. అక్కడి వరదలకు కారణం కేవలం వర్షం కాదుబీ వరుసగా సరస్సులను కలిపే నాళాలు మూసివేయబడటం, చెరువులపై నిర్మాణాలు పెరగడం. ఐటీ కంపెనీలు, టెక్ పార్కులు, హైఎండ్ కాలనీలు నిర్మించడానికి ప్రకృతిని త్యాగం చేసిన నగరం ఇప్పుడు వర్షం పడగానే పాఠం నేర్పుతోంది. ఇది మనం ప్రకృతిని ఎగతాళి చేసినదానికి ప్రకృతి ఇచ్చిన ప్రతిస్పందన అని చెప్పాలి. ప్రకృతి తన నియమాలకు కట్టుబడి ఉంటుంది. కానీ మనం నగరాలను కాంక్రీట్ అడవులుగా మార్చి, నీటి మార్గాలను మూసి, చెట్లను నరికేసి "అభివృద్ధి" అని పిలుస్తున్నాం. ఇది అభివృద్ధి కాదు, "నిర్లక్ష్యానికి కట్టిన స్మారకం." నగరాల రూపకల్పనలో వాతావరణ పరిస్థితులు, నీటి ప్రవాహ దారులు, భూభాగ ఆకృతి వంటి అంశాలు పరిగణనలోకి తీసుకోకపోవడం దురదృష్టకరం. వర్షం వచ్చినప్పుడల్లా నగరాలు మునగడం అనేది ప్లానింగ్ వైఫల్యానికి స్పష్టమైన ఉదాహరణ. ఈ సమస్యలో మరో ముఖ్య కారణం పాలనలో సమన్వయం లేకపోవడం. పట్టణ అభివృద్ధి సంస్థలు, మున్సిపల్ కార్పొరేషన్లు, రెవెన్యూ విభాగం, పర్యావరణ శాఖ ౼ ఇవన్నీ తమ తమ విధుల్లో ఉండి, పరస్పర సంబంధం లేకుండా పనిచేస్తున్నాయి. ఫలితంగా నియంత్రణ లేకుండా భవన అనుమతులు ఇస్తున్నారు. ఆక్రమణలు రాజకీయ ప్రభావంతో పెరుగుతున్నాయి. తాత్కాలిక డ్రైనేజీ క్లీనింగ్‌తో సమస్య పరిష్కారమవదని, దీని వెనుక ఉన్న మూల కారణాలను గుర్తించి శాస్త్రీయ ప్రణాళిక అవసరమని నిపుణులు చెబుతున్నారు. అదే సమయంలో పౌరుల బాధ్యత కూడా తక్కువ కాదు. ప్రతి వర్షాకాలంలో వీధుల్లో ప్లాస్టిక్, వ్యర్థాలు పడేయడం, నాళాల్లో చెత్త నింపడం మనమే చేస్తున్నాం. ప్రభుత్వం తప్పు చేస్తే మనం కూడా మినహాయింపుకాదు. మన నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడం, నీటి మార్గాలను కాపాడడం పౌరుడి కర్తవ్యం. కానీ మనం రోజువారీ సౌకర్యాలకే ప్రాధాన్యం ఇస్తూ, దీర్ఘకాలిక ఫలితాలను మరచిపోతున్నాం. ఇప్పుడు సమయం మార్పు కోరుకుంటోంది. వరదలతో పోరాడడం కంటే, వాటి కారణాలను తొలగించడం తెలివైన మార్గం. ప్రతి నగరానికి వర్ష జల ప్రణాళిక, చెరువుల పునరుద్ధరణ, ఆక్రమణల తొలగింపు, వర్షపు నీరు నిల్వ సదుపాయాలు ఇవన్నీ సమగ్రంగా అమలులోకి రావాలి. ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు, పౌరులు కలిసి చర్యలు తీసుకున్నప్పుడే నగరాలు సురక్షితంగా ఉండగలవు. చివరగా, మనం ప్రకృతిని గెలవలేం ఆమెతో సహజీవనం చేయడం నేర్చుకోవాలి. నగర వరదలు ప్రకృతి వైపరీత్యాలు కావుబీ అవి మన నిర్లక్ష్యానికి ప్రతిఫలాలు. ప్రకృతిని అవమానిస్తే, ఆమె ప్రతిస్పందన ఎప్పుడూ కఠినంగానే ఉంటుంది. పాఠం మనకు ఇప్పటికే వచ్చేసిందిబీ ఇప్పుడు దాన్ని అమలుచేయడం మన బాధ్యత.

కవితా పృధ్విరాజ్
అసోసియేట్ **ఎడిటర్**

# వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

**- రూ.8,110 మద్దతు ధరకు విక్రయించాలని మంత్రి కొండా సురేఖ సూచన**

వరంగల్, అక్టోబర్ 27: దళారుల మోసాలకు గురికాకుండా ఉండేందుకు, కాంగ్రెస్ ప్రభుత్వం పత్తిని మద్దతు ధరకు నేరుగా కొనుగోలు చేసే విధానాన్ని అమలు చేస్తోందని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ తెలిపారు. వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆమె కలెక్టర్, స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి సోమవారం ప్రారంభించారు. ప్రభుత్వం పత్తి పంటకు క్వింటాల్‌కు రూ. 8,110 మద్దతు ధరను నిర్ణయించిందని మంత్రి కొండా సురేఖ



వెల్లడించారు. రైతులు దళారుల చేతిలో మోసపోకుండా ఉండేందుకు తమ పత్తిని నేరుగా సీసీఐ కేంద్రాలకు విక్రయించాలని ఆమె సూచించారు. కొనుగోలు కేంద్రాలలో తేమ శాతం పేరుతో రైతులను ఎవరైనా ఇబ్బంది పెట్టినా, మోసాలకు పాల్పడినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. రైతులు ఎటువంటి ఆందోళన చెందకుండా, ధైర్యంగా తమ పంటను ప్రభుత్వ కేంద్రాలకు తీసుకురావాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## మోంథ పెను ప్రళయం

(మొదటి పేజీ తరువాయి) సమయంలో గంటకు 100 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో పెను గాలులు వీచే అవకాశం ఉందని, ఈదురు గాలుల తీవ్రత 140 కి.మీ. వరకు కూడా పెరగవచ్చని అధికారులు హెచ్చరించారు. తీర ప్రాంతాలలో అలలు ఉవ్వెత్తున ఎగిసి పడే అవకాశం ఉన్నందున, ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని విపత్తు నిర్వహణ సంస్థ సూచించింది. తుఫాను తీవ్రత, దాని ప్రభావ అంచనా దృష్ట్యా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందస్తుగా కఠిన చర్యలు చేపట్టింది. ముఖ్యంగా ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు, ఉభయ గోదావరి జిల్లాలు, కాకినాడ జిల్లాలకు 'రెడ్ అలర్ట్' ప్రకటించింది. ఈ ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, కొన్నిచోట్ల అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ జిల్లాల్లో అత్యవసర విధుల్లో లేని ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులందరూ కూడా అప్రమత్తంగా ఉండాలని, కిందిస్థాయి సిబ్బందిని సహాయక చర్యల కోసం సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు వెళ్లాయి. తుఫాను ప్రభావం తీవ్రంగా ఉండే లోతట్టు ప్రాంతాలు, నదీ పరీవాహక ప్రాంతాల ప్రజలను తక్షణమే సురక్షిత సహాయక శిబిరాలకు తరలించాలని ప్రభుత్వ యంత్రాంగం ఆదేశించింది. ఇందుకోసం జిల్లా యంత్రాంగాలు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశాయి. తాత్కాలిక పునరావాస కేంద్రాలలో వారికి అవసరమైన తాగునీరు, ఆహారం, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేశారు. బలహీనమైన ఇళ్లలో నివసించే వారు, పాత భవనాల్లో ఉంటున్న వారు వెంటనే శిబిరాలకు తరలి వెళ్లాలని అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో తుఫాను తీరం దాటినప్పటికీ, దాని పరోక్ష ప్రభావం తెలంగాణ రాష్ట్రంపై కూడా తీవ్రంగా ఉంటుందని వాతావరణ శాఖ ప్రకటించింది. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, నల్గొండ సహా పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ వర్షాల కారణంగా నగరాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యే ప్రమాదం ఉందని, వ్యవసాయ భూములలో నీరు నిలిచిపోయే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ప్రజలు బయటకు వెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తుఫాను ప్రభావం అధికంగా ఉండే తీర ప్రాంత జిల్లాల్లో ప్రభుత్వం అన్ని విద్యా సంస్థలకు సెలవు ప్రకటించింది. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకొని, ఈ నిర్ణయం తీసుకున్నామని విద్యాశాఖ ఉన్నతాధికారులు తెలిపారు. హాస్టళ్లలో ఉన్న విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దని అధికారులు భరోసా ఇచ్చారు. పరిస్థితులను సమీక్షించిన తర్వాతే విద్యా సంస్థలను తిరిగి తెరిచే విషయమై నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వం పేర్కొంది. విపత్తు సహాయక చర్యల కోసం జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం మరియు రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం బృందాలను ఇప్పటికే అప్రమత్తం చేసి, తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో మోహరించారు. పవర్ గ్రిడ్లు, కమ్యూనికేషన్ వ్యవస్థలు దెబ్బతినకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు 1070/1077 లేదా స్థానిక కంట్రోల్ రూమ్ నంబర్లకు సంప్రదించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ పుకార్లను నమ్మవద్దని ప్రభుత్వ అధికారులు విజ్ఞప్తి చేశారు. మత్స్యకారులు వేటకు వెళ్లకూడదని, తీరం వెంబడి ప్రజలు అనవసరంగా గుమిగూడరాదని హెచ్చరికలు జారీ అయ్యాయి.

### 'డిజిటల్ అరెస్ట్' మోసాలపై

## సుప్రీం సీరియస్

(మొదటి పేజీ తరువాయి)లమని చెప్పుకుంటూ నకిలీ కోర్టు పత్రాలతో ప్రజలను బెదిరించి, డబ్బులు వసూలు చేస్తున్న ఈ కుంభకోణాల కేసును అత్యున్నత న్యాయస్థానం సుమోటోగా విచారణకు స్వీకరించింది. సోమవారం విచారణ చేపట్టిన జస్టిస్ సూర్యకాంత్ మరియు జస్టిస్ జాయ్ మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ చేసింది. ఈ మోసాలపై దేశవ్యాప్తంగా దర్యాప్తులో ఏకరూపత ఉండేలా చూసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ విచారణలో భాగంగా, 'డిజిటల్ అరెస్ట్' మోసాలకు సంబంధించి తమ పరిధిలో నమోదైన ప్రథమ సమాచార నివేదికల (ఎఫ్ఐఆర్) వివరాలను అందించాలని సుప్రీంకోర్టు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. విచారణ సందర్భంగా, హర్యానా ప్రభుత్వం స్పందిస్తూ... అంబాలా సైబర్ క్రైమ్ బ్రాంచ్‌లో రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని, దర్యాప్తును సీబీఐకి బదిలీ చేయడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని కోర్టుకు తెలియజేసింది. సంబంధిత ఇతర ఎఫ్ఐఆర్‌ల వివరాలు సమర్పించేందుకు హర్యానా ప్రభుత్వం కోరిన వారం రోజుల సమయాన్ని ధర్మాసనం అనుమతించింది. ఈ 'డిజిటల్ అరెస్ట్' మోసాలు కేవలం దేశవ్యాప్తంగానే కాకుండా, దేశ సరిహద్దులు దాటి కూడా జరుగుతున్నాయని ధర్మాసనం అభిప్రాయపడింది. అందుకే ఇది దేశవ్యాప్త కుంభకోణంగా పరిగణించి, ఈ కేసుల దర్యాప్తును కేంద్ర దర్యాప్తు సంస్థ లిలి(సీబీఐ)లిలికి అప్పగించేందుకు మొగ్గు చూపుతున్నట్లు సూచించింది. కేంద్ర ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, ఇలాంటి అనేక కేసులను సీబీఐ ఇప్పటికే దర్యాప్తు చేస్తోందని, కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సైబర్ క్రైమ్ విభాగం సాంకేతిక సహకారం అందిస్తోందని ధర్మాసనానికి వివరించారు.

### సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్

(మొదటి పేజీ తరువాయి) సీజేఐ బాధ్యతలు చేపట్టడం అనేది ఆనవాయితీగా వస్తున్న పద్ధతికి అనుగుణంగానే ఈ సిఫార్సు జరిగింది. ప్రస్తుత సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నవంబర్ 23న పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో, జస్టిస్ సూర్యకాంత్‌ను భారత 53వ ప్రధాన న్యాయమూర్తిగా నియమించేందుకు సిఫార్సు చేస్తూ గవాయ్ కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖకు లేఖ రాశారు. ఈ సిఫార్సు ఆమోదం పొందిన తర్వాత, జస్టిస్ సూర్యకాంత్ నవంబర్ 24, 2025న సీజేఐగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఆయన ఫిబ్రవరి 9, 2027 వరకు, అంటే సుమారు 14 నెలలకు పైగా ఈ అత్యున్నత పదవిలో కొనసాగుతారు. జస్టిస్ సూర్యకాంత్ మే 24, 2019 నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా సేవలు అందిస్తున్నారు. హర్యానాకి చెందిన జస్టిస్ సూర్యకాంత్.. ఫిబ్రవరి 10, 1962న హిసార్‌లోని ఒక మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. 1981లో ప్రభుత్వ పోస్ట్ గ్రాడ్యుయేట్ కళాశాల నుండి పట్టభద్రుడై, 1984లో రోహతక్‌లోని మహర్షి దయానంద్ విశ్వవిద్యాలయం నుండి న్యాయశాస్త్రంలో బ్యాచిలర్ డిగ్రీని పొందారు. 1984లోనే హిసార్ జిల్లా కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ మొదలుపెట్టి, మార్చి 2001లో సీనియర్ న్యాయవాదిగా నియమితులయ్యారు. అనంతరం జనవరి 9, 2004న పంజాబ్ హర్యానా హైకోర్టుకు శాశ్వత న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. ఆ తర్వాత అక్టోబర్ 5, 2018 నుండి హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ కాంత్, 2019 మేలో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొంది ప్రస్తుతం సీనియర్ న్యాయమూర్తిగా కొనసాగుతున్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఆయన అనురాధ భాసిన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (2020) వంటి అనేక ముఖ్యమైన తీర్పులు వెలువరించారు. ఈ కేసులో జమ్మూ కాశ్మీర్‌లో ఇంటర్నెట్ యాక్సెస్ ఒక ప్రాథమిక హక్కు అని ఆయన ధర్మాసనం పేర్కొంది. సామాజిక న్యాయం, మానవ హక్కులు, పర్యావరణ పరిరక్షణతో పాటు రాజ్యాంగ స్ఫూర్తిని బలోపేతం చేసే అనేక సున్నితమైన కేసులలో జస్టిస్ సూర్యకాంత్ తీర్పులు ఇచ్చారు. కామన్ కాజ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (2018) వంటి పర్యావరణ సంబంధిత కేసులలో ఆయన కాలుష్య నియంత్రణకు కఠిన చర్యలను సమర్థించారు. మహిళా హక్కులు, లింగ సమానత్వం, ప్రైవసీ హక్కు వంటి అంశాలపై ఆయన వెలువరించిన తీర్పులు న్యాయ చరిత్రలో కీలకంగా నిలిచాయి.

# డిజిటల్ యుగంలో పెరుగుతున్న ముప్పులు

(మొదటి పేజీ తరువాయి) అంటే కేవలం శారీరక భద్రత కాదు డిజిటల్ భద్రత కూడా అంతే అవసరం. సైబర్ సెక్యూరిటీ అనేది కంప్యూటర్ సిస్టమ్‌లు, నెట్‌వర్క్‌లు, డేటాను హానికరమైన దాడుల నుండి రక్షించడమే. హ్యాకర్లు లేదా సైబర్ నేరస్థులు వ్యక్తిగత సమాచారం, ప్రభుత్వ గోప్య డేటా, కంపెనీల వ్యాపార రహస్యాలను దొంగిలించే ప్రయత్నం చేస్తారు. వీటిని అడ్డుకోవడం, సురక్షితమైన ఆన్‌లైన్ వాతావరణాన్ని నిర్మించడం సైబర్ సెక్యూరిటీ లక్ష్యం. ఇంటర్నెట్ వినియోగం పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరాలు కూడా విస్తరిస్తున్నాయి. ఫిషింగ్ ఇమెయిల్స్, ర్యాన్సమ్‌వేర్ దాడులు, ఐడెంటిటీ థెఫ్ట్, సోషల్ మీడియా మోసాలు ఇవన్నీ మన రోజువారీ జీవితంలో భాగమైపోయాయి. డిజిటల్ ట్రాన్సాక్షన్లు పెరిగిన తర్వాత బ్యాంకింగ్ మోసాలు కూడా పెరిగాయి. వ్యక్తిగత అవగాహన లేకపోవడం వల్ల చాలా మంది ఈ నేరాలకు బలవుతున్నారు. భారత ప్రభుత్వం సైబర్ భద్రతను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటోంది. వంటి కార్యక్రమాలు డిజిటల్ సురక్షిత వాతావరణాన్ని ఏర్పరచడంలో ముందున్నాయి. ఈ సంస్థలు హ్యాకింగ్ దాడులపై పర్యవేక్షణ, అవగాహన కార్యక్రమాలు, శిక్షణ వర్క్‌షాపులు నిర్వహిస్తున్నాయి. కానీ ప్రభుత్వ చర్యలతో పాటు ప్రతి పౌరుడు కూడా జాగ్రత్తగా ఉండాలి. ప్రతి ఒక్కరూ సైబర్ భద్రతలో తమ పాత్రను గుర్తించాలి. బలమైన పాస్‌వర్డ్‌లు వాడడం, రెండు-స్థాయి ధృవీకరణ సదుపాయం ఆన్ చేయడం, అనుమానాస్పద లింక్‌లు క్లిక్ చేయకపోవడం, పబ్లిక్ వై-ఫై నెట్‌వర్క్‌లను జాగ్రత్తగా వాడడం వంటి చిన్న జాగ్రత్తలు పెద్ద ప్రమాదాలను తప్పించగలవు. "సైబర్ సెక్యూరిటీ అంటే కేవలం సాఫ్ట్‌వేర్ కాదు. అది మన ప్రవర్తన" అనే అవగాహన కలగాలి. పాఠశాల, కళాశాల స్థాయిలోనే విద్యార్థులకు సైబర్ సురక్షిత ప్రవర్తన గురించి బోధించాలి. డిజిటల్ లిటరసీ అంటే కేవలం కంప్యూటర్ వాడటం కాదు ౼ సురక్షితంగా వాడటం కూడా. విద్యార్థులు తమ సోషల్ మీడియా సమాచారాన్ని జాగ్రత్తగా పంచుకోవడం, ఆన్‌లైన్ మోసాలను గుర్తించడం నేర్చుకోవాలి. ఈ తరహా అవగాహన సబ్జెక్టు తరగతుల్లో భాగం చేయడం అవసరం. ప్రైవేట్ సంస్థలు, బ్యాంకులు, ఐటీ కంపెనీలు తమ డేటా భద్రతకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. ఫైర్‌వాల్‌లు, ఎన్‌క్రిప్షన్, సెక్యూరిటీ టెస్టింగ్ వంటి పద్ధతులు నిరంతరం నవీకరించాలి. ఉద్యోగులకు సైబర్ భద్రతా శిక్షణ ఇవ్వడం ద్వారా కంపెనీలు ముప్పులను తగ్గించవచ్చు. ఎందుకంటే ఒక చిన్న తప్పిదం కూడా పెద్ద నష్టం కలిగించగలదు. డిజిటల్ యుగం మనకు అపారమైన అవకాశాలు ఇచ్చింది. కానీ అదే సమయంలో బాధ్యతలు కూడా పెంచింది. సైబర్ సెక్యూరిటీ ఇప్పుడు ప్రతి పౌరుడి జీవిత భాగం కావాలి. టెక్నాలజీని సద్వినియోగం చేస్తూ, భద్రతను కాపాడుకుంటేనే మనం నిజమైన డిజిటల్ భారతాన్ని నిర్మించగలం. ఒక జాగ్రత్త వినియోగదారుడు లక్షల సైబర్ నేరాలను అడ్డుకోవచ్చు. కాబట్టి ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి.

## రాష్ట్రంపై 'మోంథా' ప్రభావం

**– మరో మూడు రోజులు నాన్‌స్టాప్ వర్షాలు..**

**– ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

(మొదటి పేజీ తరువాయి) మూడు రోజుల పాటు వర్షాలు కొనసాగుతాయని వాతావరణ శాఖ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. నిన్న ఆగ్నేయ బంగాళాఖాతం పరిసరాల్లో కేంద్రీకృతమైన తీవ్ర వాయుగుండం మరింత బలపడి, రాత్రి సుమారు 23:30 గంటలకు నైరుతి బంగాళాఖాతం, సమీప ఆగ్నేయ బంగాళాఖాతం ప్రాంతంలో తుఫానుగా మారింది. దీనికి 'మొంథా' అని పేరు పెట్టారు. ఈ తుఫాను వాయు దిశలో కదులుతూ ఈరోజు ఉదయం 08:30 గంటలకు పశ్చిమ మధ్య బంగాళాఖాతం ప్రాంతానికి చేరుకుంది. ప్రస్తుతం ఇది చెన్నైకి ఆగ్నేయంగా 520 కిలోమీటర్లు, కాకినాడకు దక్షిణ ఆగ్నేయంగా 570 కిలోమీటర్లు, విశాఖపట్నంకి దక్షిణ ఆగ్నేయంగా 600 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. రాగల 24 గంటలలో 'మొంథా' తుఫాను ఉత్తర, వాయువ్యదిశలో కదులుతూ మరింత బలపడి రేపు (అక్టోబర్ 28) ఉదయానికి తీవ్ర తుఫానుగా మారే ప్రమాదం ఉంది. ఈ తీవ్ర తుఫాను మచిలీపట్నం %-% కళింగపట్నం మధ్యలో, ఇంచుమించు కాకినాడకు సమీపంలో రేపు సాయంత్రం లేదా రాత్రి సమయంలో ఆంధ్రప్రదేశ్ తీరాన్ని దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. తుఫాను తీరం దాటే సమయంలో గంటకు 90 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. 'మొంథా' తుఫాను పయనం కారణంగా తెలంగాణ రాష్ట్రంలో వర్షాలు విస్తృతంగా కురవనున్నాయి. సోమవారం రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉంది. మంగళవారం, బుధవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో చాలాచోట్ల తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. కావున, ప్రజలు అత్యవసరం అయితే తప్ప ప్రయాణాలు పెట్టుకోరాదని, రైతులు తమ పంట ఉత్పత్తులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులు సూచిస్తున్నారు. విద్యుత్, రోడ్డు మార్గాలకు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను అప్రమత్తం చేశారు.

### వీధి కుక్కల సమస్యపై

## సుప్రీంకోర్టు

### సంచలన వ్యాఖ్యలు

(మొదటి పేజీ తరువాయి) కలిగిస్తోందని, ఇలాంటి సంఘటనలు నిరంతరం జరుగుతున్నాయని కోర్టు విచారం వ్యక్తం చేసింది. వీధి కుక్కల బెడద కారణంగానే మన దేశాన్ని విదేశీయులు కించపరిచేలా మాట్లాడటానికి ఒక కారణం అవుతోందని సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. ఈ వ్యాఖ్యలు దేశంలో వీధి కుక్కల నియంత్రణ అంశం ఎంత తీవ్రంగా ఉందో తెలియజేస్తున్నాయి.

## సీక్రెట్ వీడియోలే కొంప ముంచాయి

**ప్రియుడిని చంపించి, యాక్సిడెంట్‌గా చిత్రీకరించిన లివ్-ఇన్ పార్ట్‌నర్**

(మొదటి పేజీ తరువాయి) రమేష్ యూపీఎస్సీకి ప్రిపేర్ అవుతున్నాడు. కొన్ని నెలల క్రితం అతడికి 21 ఏళ్ల అమ్రితతో పరిచయం ఏర్పడి, అది ప్రేమగా మారింది. ఇద్దరూ గాంధీ విహార్‌లో ఓ ఫ్లాట్ అద్దెకు తీసుకుని సహజీవనం మొదలుపెట్టారు. ఈ క్రమంలో, రమేష్ ఇద్దరూ ఏకాంతంగా గడిపిన దృశ్యాలను సీక్రెట్‌గా వీడియోలు తీసి, హార్డ్ డిస్క్‌లో దాచిపెట్టాడు. ఈ విషయం అమ్రితకు తెలియడంతో, ఆమె రమేష్‌ను నిలదీసి, ఆ వీడియోలను తొలగించాలని కోరింది. అయితే, రమేష్ అందుకు నిరాకరించాడు. దీంతో ఆగ్రహానికి గురైన అమ్రిత, ఈ సమస్యను తన మాజీ ప్రియుడు సుమిత్ కశ్యప్‌కు చెప్పింది. వీడియోల విషయంలో రమేష్ బెదిరింపులకు పాల్పడుతుండటంతో, అమ్రిత, సుమిత్ కలిసి అతడిని హత్య చేయాలని నిర్ణయించుకున్నారు. సుమిత్ తన స్నేహితుడు సందీప్ కుమార్ సహాయం తీసుకున్నాడు. అక్టోబర్ 5వ తేదీ రాత్రి సుమిత్, సందీప్.. రమేష్ ఫ్లాట్‌కు వెళ్లి అతడిని కొట్టి, గొంతు నులిమి చంపేశారు. ఆ తర్వాత హత్యను ప్రమాదంగా చిత్రీకరించేందుకు, మృతదేహంపై నూనె, నెయ్యి, వైన్ పోశారు. సుమిత్ గ్యాస్ సిలిండర్ ఆన్ చేసి రమేష్ తల దగ్గర పెట్టి, సిగరెట్లు కాల్చే లైటర్‌ను అంటించి డెడ్ బాడీకి కొద్దిదూరంలో ఉంచాడు. అనంతరం రమేష్‌కు సంబంధించిన రెండు ల్యాప్‌ట్యాప్‌లు, హార్డ్ డిస్క్‌లు తీసుకుని అక్కడి నుంచి పారిపోయారు. లీకైన గ్యాస్ వల్ల గంట తర్వాత లైటర్ అంటుకుని బ్లాస్ట్ జరగడంతో ఇల్లు మొత్తం కాలిపోయింది. మొదట పోలీసులు దీనిని అగ్నిప్రమాదంగా భావించినా, రమేష్ తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేయడంతో అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా అక్టోబర్ 18న అమ్రితను అరెస్ట్ చేసి విచారించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. మిగిలిన ఇద్దరు నిందితులు సుమిత్, సందీప్‌లను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు.

## రాష్ట్రాల సీఎస్‌లకు సమన్లు.. తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సుప్రీం:

(మొదటి పేజీ తరువాయి) వీధి కుక్కల సమస్యను పరిష్కరించడానికి మరియు నియంత్రించడానికి సంబంధించి సుప్రీంకోర్టు గతంలో జారీ చేసిన నియమాలను అమలు చేసే చర్యలపై అఫిడవిట్లు సమర్పించడంలో నిర్లక్ష్యం వహించిన రాష్ట్రాలపై జస్టిస్ విక్రమ్ నాథ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్, తెలంగాణ రాష్ట్రాలు మినహా, సుప్రీంకోర్టు ఆదేశాల అమలు వివరాలను అఫిడవిట్ రూపంలో సమర్పించని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల చీఫ్ సెక్రటరీలకు సుప్రీంకోర్టు సమన్లు జారీ చేస్తున్నట్లు జస్టిస్ విక్రమ్ నాథ్ తెలిపారు. అఫిడవిట్లను ఎందుకు సమర్పించలేదో వివరణ ఇవ్వాలని ఆయా రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలను సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణను వచ్చే సోమవారానికి వాయిదా వేశారు. ఈ సమన్లు మరియు ఆదేశాలు వీధి కుక్కల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వాలు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవస రాన్ని నొక్కి చెబుతున్నాయి.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి) క్షుణ్ణంగా చర్చించారు. ధాన్యం సేకరణ కేంద్రాల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రైతులు కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా, ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా, వేగంగా సాగేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రభుత్వం రైతు కష్టం వృథా కాకుండా చూస్తుందని, ప్రతి గింజను సకాలంలో కొనుగోలు చేస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

**– పత్తి కొనుగోలు, తక్షణ సహాయంపై ప్రాధాన్యత**

వరి ధాన్యం సేకరణతో పాటు పత్తి కొనుగోలు ప్రక్రియను కూడా యుద్ధ ప్రాతిపదికన వేగవంతం చేయాల్సిన అవసరాన్ని మంత్రి నొక్కి చెప్పారు. ఇటీవలి వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతుల అంశాన్ని ప్రస్తావిస్తూ, వారికి తక్షణ సహాయం అందించడం ప్రభుత్వ అత్యంత ప్రాధాన్యత అంశమని స్పష్టం చేశారు. రైతులు పండించిన ప్రతి గింజకు న్యాయమైన ధర కల్పించాలనేదే ప్రభుత్వ ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. రైతు సంక్షేమంపై తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. రైతులు దళారుల బారిన పడకుండా, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకునేలా అధికారులు అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. రైతు సమస్యల పరిష్కారం కోసం అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, రైతులకు అండగా నిలవాలని ఆయన దిశానిర్దేశం చేశారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన తెలియజేశారు.

## తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి) ఖర్చులను పరిగణనలోకి తీసుకుని, దాదాపు పదిహేనేళ్ల క్రితం నిర్ణయించిన రేట్లను తాజాగా సడలించింది. కొత్తగా పెంచిన సీలింగ్ లిమిట్ల ప్రకారం, మంత్రుల అధికారిక నివాసాల మరమ్మతుల కోసం రూ.20 లక్షల వరకు ఖర్చు చేసేందుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. అలాగే, ఐఏఎస్ మరియు ఐపీఎస్ అధికారుల గృహాల రిపేర్ ఖర్చుల పరిమితిని రూ.12 లక్షల వరకు పెంచారు. ఇతర ప్రభుత్వ అధికారుల అధికారిక నివాసాల మరమ్మతులకు రూ.7 లక్షల వరకు ఖర్చు చేసేందుకు ప్రభుత్వం పర్మిషన్ ఇచ్చింది. ఆర్ అండ్ బీ చీఫ్ ఇంజనీర్ సిఫార్సులను పరిశీలించిన అనంతరం ప్రభుత్వం ఈ పెంపునకు ఆమోదం తెలిపింది. పెంచిన ఈ కొత్త పరిమితులను తక్షణమే అమలు చేయాలని ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ వికాస్ రాజ్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# హైడ్రా ప్రజావాణికి 52 ఫిర్యాదులు కబ్జాదారులపై కమిషనర్ దృష్టి

(మొదటి పేజీ తరువాయి) చూపిస్తూ నేరుగా హైడ్రా కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేస్తున్నారు. ఈ ప్రజావాణి ద్వారా తమ దశాబ్దాల సమస్యలకు సైతం త్వరగా పరిష్కారం దొరుకుతుందనే నమ్మకంతో సోమవారం ఒక్కరోజే 52 ఫిర్యాదులు అందాయి. కొందరు బాహాటంగా ఫిర్యాదులు చేస్తుండగా, మరికొందరు తమ వివరాలు బయటపెట్టవద్దని అధికారులను కోరారు. అందిన ఫిర్యాదులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రత్యేకంగా పరిశీలించారు. అత్యధికంగా ఫిర్యాదులు కబ్జాల మీదనే ఉండటం గమనార్హం. బాలానగర్ మండలం, కూకట్‌పల్లిలోని హస్మత్‌పేటలో ప్రభుత్వానికి చెందిన 10 ఎకరాల భూమిని ఆక్రమిస్తున్నారని ఫిర్యాదు వచ్చింది. అదే ప్రాంతంలో, నిజాం కాలం నాటి చారిత్రక విలువ కలిగిన 28.28 ఎకరాల ప్రభుత్వ భూమిని స్థానిక రాజకీయ నాయకులు రియల్ ఎస్టేట్ వెంచర్‌గా మార్చి విక్రయిస్తున్నారని ఓల్డ్ బోయిన్‌పల్లి నివాసులు సాక్ష్యాలతో సహా ఫిర్యాదు చేశారు. మరో ప్రధాన సమస్య చెరువుల అన్యాక్రాంతం. కూకట్‌పల్లి ప్రాంతంలోని పరికి చెరువులో సుమారు 12 ఎకరాల మేర రాత్రికి రాత్రే మట్టిపోసి ఆక్రమించారని, అక్కడ 18 అంతస్తుల అపార్ట్‌మెంట్ నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తే ప్లాట్లు కొన్నవారు నష్టపోతారని హెచ్చరించారు. శంషాబాద్ మండలం, పెద్దగోల్కొండలో సరసింహకుంట తూములు మూసివేయడం, అలుగు ఎత్తు పెంచడంతో పంట పొలాలు మునిగి, ఆ నీరు ఔటర్ రింగు రోడ్డుపైనా చేరుతోందని గ్రామ ప్రజలు మొరపెట్టుకున్నారు. సంగారెడ్డి జిల్లా, అమీన్‌పూర్ మున్సిపాలిటీలోని శాంబుని కుంట వాస్తవ విస్తీర్ణం 22 ఎకరాలు ఉన్నా, ప్రస్తుతం ఆరేడు ఎకరాలకు పరిమితమైందని, మట్టిపోసి ఆక్రమణలు జరుగుతున్నాయని ఫిర్యాదు అందింది. అమీన్‌పూర్ పెద్ద చెరువులో కూడా భవన నిర్మాణాలు చేపడుతున్నారని, అడ్డుకున్న తమపై దాడులు చేసి, పోలీసు కేసులతో భయపెడుతున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే, రోడ్ల ఆక్రమణలపై కూడా ఫిర్యాదులు అందాయి. సాగర్‌రోడ్డులోని యశోదానగర్ కాలనీలో ఇంటి స్థలాల యజమానులు రోడ్డును కలుపుకొని దారి లేకుండా చేస్తున్నారని రెసిడెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. దీంతో కాలనీ రోడ్ల మీదుగా తిరగాలంటే కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందని వాపోయారు. మొత్తం 52 ఫిర్యాదులను పరిశీలించిన కమిషనర్ రంగనాథ్, వెంటనే ఆయా విభాగాల అధికారులు రంగంలోకి దిగి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆదేశించారు.

## మోదీ కోసం పనిచేస్తున్న రేవంత్

(మొదటి పేజీ తరువాయి) భాయ్' (మోదీ) కోసం పనిచేస్తున్నారని, అందుకే ఇక్కడ నడుస్తున్నది కాంగ్రెస్–బీజేపీ కలిసి నడిపిస్తున్న ప్రభుత్వమని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలే కాకుండా వంద గ్యారెంటీలు అమలు చేస్తామని కాంగ్రెస్ చెప్పిందని, తులం బంగారం ఇస్తాం, యువతులకు రూ.2500 ఇస్తాం, వృద్ధులకు రూ.4 వేలు పెన్షన్ ఇస్తామని అరచేతిలో స్వర్గం చూపించారని ఎద్దేవా చేశారు. "అదేదో సినిమాలో కోడిని వేలాడదీసి దాన్నే చికెన్ అనుకోమన్నట్లు.. ఇక్కడ కూడా అన్నీ చెప్పి, ఒక్కటి కూడా అమలు చేయట్లేరు" అని కేటీఆర్ విమర్శించారు. మైనార్టీ విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తామని చెప్పి కాంగ్రెస్ మాట తప్పిందని, కేసీఆర్ హయాంలో ఇచ్చిన పథకాలను కూడా ప్రస్తుత ప్రభుత్వం నిలిపివేసిందని మండిపడ్డారు.

**– మైనార్టీలకు ప్రాధాన్యత ఇవ్వట్లేదు**

2018లో ఎన్నికలు గెలిచిన తర్వాత కేసీఆర్ మహమూద్ అలీని డిప్యూటీ సీఎంని చేశారని కేటీఆర్ గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్క మైనార్టీ ఎమ్మెల్యే కానీ, ఎమ్మెల్సీ కానీ లేరని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలోనైనా ఒక్క మైనార్టీ లీడర్‌ను కూడా ఎన్నుకోలేదని ఆయన నిలదీశారు. షబ్బీర్ అలీ, అజారుద్దీన్ లాంటి వారు కూడా కాంగ్రెస్ నాయకత్వానికి కనిపించట్లేదా అంటూ కేటీఆర్ ప్రశ్నించారు.

భారత్–చైనా విమాన సేవలు

## పునఃప్రారంభం

(మొదటి పేజీ తరువాయి) ఇండిగో విమానంలోని ప్రయాణికులకు చైనా సోమవారం ఘన స్వాగతం పలికింది. ఈ విమాన సేవలు పునఃప్రారంభం కావడాన్ని భారతదేశంలోని చైనా రాయబార కార్యాలయ ప్రతినిధి యు జింగ్ స్వాగతించారు. "అక్టోబర్ 27న ఉదయం, ఇండిగో ఎయిర్‌లైన్స్ విమానం చైనాలోని గ్వాంగ్జౌకు సురక్షితంగా చేరుకుంది. హృదయపూర్వక స్వాగతం పలుకుతున్నాం," అని ఆయన 'ఎక్స్' (గతంలో ట్విట్టర్) వేదికగా పోస్టు చేశారు. కోల్‌కతాలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి నిన్న అర్ధరాత్రి తర్వాత ఈ మొదటి విమానం గాంగ్జౌకు బయలుదేరింది. నవంబర్ 11వ తేదీ నుంచి కోల్‌కతా–గ్వాంగ్జౌ మార్గంలో విమాన సర్వీసులను ప్రతిరోజూ నడుపుతామని ఇండిగో ప్రకటించింది. షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సమావేశం సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ సమావేశమైన సమయంలోనే రెండు దేశాల మధ్య విమాన సర్వీసులను తిరిగి ప్రారంభించాలని నిర్ణయించడం జరిగింది. ఆ నిర్ణయానికి అనుగుణంగానే ప్రస్తుతం ఈ విమాన సేవలు పునఃప్రారంభమయ్యాయి.

# ఐపీఓలో పెట్టుబడులకు బ్యాంకు రుణం




ముంబై:అక్టోబర్ 27, 2025 : తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ), మలి విడత పబ్లిక్ ఆఫరింగ్ (ఎఫ్‌పీఓ) లేదా ఎంప్లాయీ స్టాక్ ఆప్షన్ ప్లాన్ (ఈఎసఓపీ) ద్వారా షేర్లను కొనుగోలు చేసేందుకు వ్యక్తుల (ఇండివిడ్యువల్స్)కు బ్యాంకులు రుణాలిచ్చేందుకు వీలుగా భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ముసాయిదా నిబంధనలను శుక్రవారం జారీ చేసింది. అలాగే, భారత కంపెనీల వ్యూహాత్మక కొనుగోళ్లు, విలీనాలకు కూడా బ్యాంకులు నిధులు సమకూర్చేందుకూ అవసరమైన ముసాయిదా నిబంధనలను కూడా విడుదల చేసింది. హేతుబద్ధీకరించిన నిబంధనలను 2026 ఏప్రిల్ 1 నుంచి అమలు చేయాలని ఆర్‌బీఐ ప్రతిపాదించింది. తద్వారా వ్యక్తులు.. పబ్లిక్ ఇష్యూల్లో పెట్టుబడులు పెట్టేందుకు, కార్పొరేట్ కంపెనీలు ఇతర సంస్థల్లో వాటాలు కొనుగోలు చేసేందుకు అవసరమైన నిధుల సమీకరణకు అవకాశాలు పెరగనున్నాయి. ఈ ముసాయిదా మార్గదర్శకాలపై నవంబరు 21లోగా అభిప్రాయాలు తెలపాలని సంబంధిత వర్గాలను ఆర్‌బీఐ కోరింది. సబ్‌స్క్రిప్షన్ విలువలో 75% రుణం: భారతీయ రిజర్వ్ బ్యాంక్ (కమర్షియల్ బ్యాంక్స్– క్యాపిటల్ మార్కెట్ ఎక్స్‌పోజర్) డైరెక్షన్స్, 2025' ప్రకారం.. ఐపీఓ, ఎఫ్‌పీఓ, ఈఎసఓపీలో భాగంగా షేర్ల కొనుగోలుకు బ్యాంకులు.. వ్యక్తికి రూ.25 లక్షల వరకు రుణం మంజూరు చేయవచ్చు. ప్రస్తుతం ఈ పరిమితి రూ.10 లక్షలుగా ఉంది. అయితే, పబ్లిక్ ఆఫరింగ్ లేదా ఈఎసఓపీ సబ్‌స్క్రిప్షన్ విలువలో బ్యాంకుల రుణ వాటా 75 శాతానికి మించకూడదని, మిగతా 25 శాతం రుణగ్రహీత సమకూర్చుకోవాలని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. అలాగే, పబ్లిక్ ఆఫరింగ్స్, ఈఎసఓపీలో భాగంగా రుణగ్రహీతకు కేటాయించబడే షేర్లపై బ్యాంకులకు ధరావతు హక్కు కల్పించాలని, ఆ షేర్లను కేటాయించాక రుణగ్రహీత వాటిని బ్యాంకు వద్ద తనఖా పెట్టాల్సి ఉంటుదని తెలిపింది.మించకూడదని, మిగతా 25 శాతం రుణగ్రహీత సమకూర్చుకోవాలని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. అలాగే, పబ్లిక్ ఆఫరింగ్స్, ఈఎసఓపీలో భాగంగా రుణగ్రహీతకు కేటాయించబడే షేర్లపై బ్యాంకులకు ధరావతు హక్కు కల్పించాలని, ఆ షేర్లను కేటాయించాక రుణగ్రహీత వాటిని బ్యాంకు వద్ద తనఖా పెట్టాల్సి ఉంటుదని తెలిపింది.

## నవీన్ యాదవ్ గెలుపుపై మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యూహ రచన

(మొదటి పేజీ తరువాయి) ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా ప్రచారాన్ని మరింత వేగవంతం చేసేలా ఈ సమావేశంలో సమగ్ర కార్యాచరణ రూపొందించారు. ముఖ్యమంత్రి రోడ్ షో నిర్వహించడం ద్వారా ప్రచారానికి మరింత జోష్ నింపాలని నిర్ణయించారు. యూసుఫ్‌గూడా డివిజన్‌లోని ప్రతి కాలనీలో డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించాలని నేతలకు దిశానిర్దేశం చేశారు. ఈ ప్రచారంలో ప్రజాపాలన ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని నిర్ణయం తీసుకున్నారు. లోకల్ క్యాడర్‌లో "జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలుస్తుంది" అనే నమ్మకాన్ని, ఉత్సాహాన్ని నింపాలని సూచించారు.

– పోలింగ్ పర్యవేక్షణకు ప్రత్యేక ప్రణాళిక

పోలింగ్ రోజు ఓటింగ్ శాతాన్ని పెంచేలా ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. ప్రతి 100 ఓట్లకు ఒక ఇన్‌ఛార్జిని ఏర్పాటు చేసి, పోలింగ్ రోజు ప్రతి ఓటరు పోలింగ్ కేంద్రానికి చేరుకొని ఓటు వేసేలా పర్యవేక్షణ చేయాలని మంత్రి ప్రభాకర్ దిశా నిర్దేశం చేశారు. ఈ వ్యూహాల ద్వారా యూసుఫ్‌గూడా డివిజన్‌లో భారీ మెజారిటీ సాధించేలా సమగ్ర కార్యాచరణను రూపొందించారు.సమావేశానికి ముఖ్యమంత్రి సలహాదారు వేం. నరేందర్ రెడ్డితో పాటు ఎమ్మెల్యేలు ఈర్లపల్లి శంకయ్య, కసిరెడ్డి నారాయణ రెడ్డి, బత్తుల లక్ష్మా రెడ్డి, జయవీర్ రెడ్డి, బెల్లయ్య నాయక్, శివసేన రెడ్డి, గిరిధర్ రెడ్డి, గుత్తా అమిత్ రెడ్డి, ఎగ్గె మల్లేశం, లక్ష్మణ్ యాదవ్, ఝాన్సీ రెడ్డి, కుస్రు పాషా, సంజయ్ గౌడ్, డివిజన్ ప్రెసిడెంట్ ఫిరోజ్ ఖాన్ తదితరులు హాజరయ్యారు.

## ఉక్కిరిబిక్కిరి చేస్తున్న ఢిల్లీ కాలుష్యం

(మొదటి పేజీ తరువాయి) డేటా ప్రకారం, కొన్ని ప్రాంతాల్లో పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. అశోక్ విహార్‌లో ఏక్యూఐ 416తో అత్యధికంగా నమోదైంది, ఇది "తీవ్రమైన" కాలుష్య స్థాయి. గౌతమ్ పురి వద్ద 415, ఆనంద్ విహార్ వద్ద 366గా గాలి నాణ్యత సూచీ ఉంది. ఇతర ప్రాంతాలైన గణేశ్‌పూర్ (318), జీటీబీ నగర్ (302), కశ్మీర్ గేట్ ఐఎస్‌బీటీ (298), యమూర్ విహార్ (287)లలో కూడా గాలి నాణ్యత క్షీణించింది. ఈ తీవ్రమైన వాయుకాలుష్యం కారణంగా ఢిల్లీ వాసులు అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఢిల్లీ, నోయిడా, గురుగ్రామ్, ఫరీదాబాద్, ఘజియాబాద్‌లోని ఆసుపత్రుల్లో రోగుల రద్దీ విపరీతంగా పెరిగింది. దగ్గు, గొంతు నొప్పి, శ్వాసకోశ సమస్యలు, ఛాతీలో నొప్పి వంటి సమస్యలతో స్థానికులు చికిత్స కోసం వస్తున్నట్లు వైద్యులు తెలిపారు. ఎయిర్ క్వాలిటీ అండ్ వెదర్ ఫోర్‌కాస్టింగ్ అండ్ రిసెర్చ్ నివేదిక ప్రకారం, ఏక్యూఐ 400 దాటితే కాలుష్యం తీవ్ర స్థాయిలో ఉన్నట్లు, 300 దాటితే మరింత అధ్వాన్నంగా ఉన్నట్లు అర్థం. కాగా, ఈరోజు ఢిల్లీలో గరిష్ట ఉష్ణోగ్రతలు కనిష్ట ఉష్ణోగ్రతలు 17ఓజ–19గా నమోదయ్యే అవకాశం ఉందని, రాత్రికి స్వల్ప వర్షం కురిసే అవకాశం ఉందని ఢిల్లీ ఆర్ఎమ్‌సీ అంచనా వేసింది.

# కట్టింగ్ మాస్టర్‌గా మారిన సీఎం రేవంత్ రెడ్డి"

**– దక్కన్ వ్యవహారంపై సీబీఐ విచారణకు సిద్ధమా?**

**– హరీశ్ రావు సవాల్**

హైదరాబాద్, అక్టోబర్ 27:

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్యాబినెట్ 'దండుపాళ్యం ముఠా' లాంటిదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు మరోసారి తీవ్ర స్థాయిలో విమర్శించారు. తాను ఒక్కసారి కాదు, పదిసార్లు ఇదే మాట అంటానని ఆయన స్పష్టం చేశారు. ఉన్న విషయం మాట్లాడితే కొందరు మంత్రులకు ఉలుకు ఎందుకని ఆయన ప్రశ్నించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ముధోల్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ నేత సిందే దీక్షిత్‌తో పాటు ఆయన అనుచరులను బీఆర్ఎస్ పార్టీలోకి కండువా కప్పి ఆహ్వానించిన అనంతరం ఆయన మాట్లాడారు. మంత్రుల పంచాయతీల పరిష్కారం కోసమే ముఖ్యమంత్రి క్యాబినెట్ సమావేశాలు పెట్టుకుంటున్నారని హరీశ్ రావు విమర్శించారు. ఈ సందర్భంగా దక్కన్ యాజమాన్యాన్ని తుపాకీతో బెదిరించిన వ్యవహారాన్ని ప్రస్తావించారు. ఈ కేసులో నిగ్గు తేల్చేందుకు సీబీఐ విచారణకు సిద్ధమా? అంటూ ఆయన సీఎం రేవంత్ రెడ్డికి నేరుగా సవాల్ విసిరారు. దమ్ముంటే ఈ అంశంపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.– రేవంత్‌పై 'కటింగ్ మాస్టర్' విమర్శ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక్క భవనం కూడా కట్టలేదని, కానీ 'కటింగ్ మాస్టర్‌గా' మారారని హరీశ్ రావు ఎద్దేవా చేశారు. కేసీఆర్ ప్రారంభించిన సంక్షేమ పథకాలకు కోత (కటింగ్) పెట్టడం, కేసీఆర్ కట్టిన భవనాలకు రిబ్బన్ కట్ చేయడం రేవంత్ రెడ్డి పని అంటూ ఆయన వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఈ ప్రభుత్వ హయాంలో ఆదిలాబాద్ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టుల విషయంలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని హరీశ్ రావు విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే ప్రజల సమస్యలపై దృష్టి సారించి, అభివృద్ధి పనులను చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.



## ఇది వ్యక్తుల మధ్య కాదు, తెలంగాణ భవిష్యత్తు కోసం జరిగే ఎన్నిక

**– డా. కె. లక్ష్మణ్**



హైదరాబాద్, అక్టోబర్ 27:

జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నిక కేవలం అభ్యర్థుల మధ్య పోటీ కాదని, ఇది తెలంగాణ ప్రజల భవిష్యత్తు కోసం జరిగే ఎన్నిక అని బీజేపీ రాజ్యసభ సభ్యులు, జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షులు డా. కె. లక్ష్మణ్ అన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న రెండు ప్రధాన పార్టీల పాలనతో ప్రజలు విసిగిపోయారని ఆయన వ్యాఖ్యానించారు. బీజేపీ కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా కృషి చేసి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పార్టీ అభ్యర్థిని గెలిపించాలని డా. లక్ష్మణ్ పిలుపునిచ్చారు. "మనం బీజేపీ గెలుపు కోసం కృషి చేయాలి. జూబ్లీహిల్స్‌లో గెలిచి, ఆ తర్వాత రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకురావాలి" అని ఆయన స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక రాబోయే రాష్ట్ర ఎన్నికలకు ఒక దిశానిర్దేశం చేస్తుందని, ఇక్కడ గెలుపు బీజేపీకి మరింత బలం చేకూరుస్తుందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# డాక్టర్ రెడ్డీస్ త్రైమాసిక లాభం రూ.1,437 కోట్లు




హైదరాబాద్ : అక్టోబర్ 27, 2025 : డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్.. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలను ప్రకటించింది. జూలై–సెప్టెంబరు త్రైమాసికానికి గాను కంపెనీ కన్సాలిడేటెడ్ నికర లాభం 14.5 శాతం వృద్ధి చెంది రూ.1,437 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో లాభం రూ.1,255 కోట్లుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో మొత్తం రెవెన్యూ కూడా 9.8 శాతం వృద్ధితో రూ.8,016 కోట్ల నుంచి రూ.8,805 కోట్లకు చేరుకుంది. సెప్టెంబరు త్రైమాసికంలో బ్రాండెడ్ మార్కెట్లలో పనితీరు మెరుగ్గా ఉండటంతో పాటు నికోటిన్ రీప్లేస్‌మెంట్ థెరపీ (ఎన్ఆర్‌టీ) విభాగం నిలకడగా కొనసాగటం కలిసి వచ్చిందని డాక్టర్ రెడ్డీస్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫఓ) ఎంవీ నరసింహం అన్నారు. అమెరికా ఆదాయాల్లో 13% క్షీణత: సెప్టెంబరు త్రైమాసికంలో అమెరికా మార్కెట్ నుంచి ఆదాయాలు 13 శాతం తగ్గినట్లు డాక్టర్ రెడ్డీస్ వెల్లడించింది. ఈ కాలంలో అమెరికా ఆదాయాలు రూ.3,728 కోట్ల నుంచి రూ.3,241 కోట్లకు తగ్గినట్లు పేర్కొంది. లెనాలిడొమైడ్ సహా కొన్ని కీలక ఉత్పత్తుల ధరలు గణనీయంగా తగ్గటమే ఇందుకు కారణమని తెలిపింది. అయితే కొత్త ఉత్పత్తుల విడుదల పెరగటం, విదేశీ మారక ఆదాయం సానుకూలంగా ఉండటం కొంత కలిసివచ్చిందని పేర్కొంది. యూరప్, భారత్ ఆదాయాల్లో వృద్ధి: ఎన్ఆర్‌టీ పోర్టుఫోలియో కొనుగోలుతో యూరప్ మార్కెట్ల నుంచి ఆదాయాలు ఏకంగా 138 శాతం వృద్ధితో రూ.577 కోట్ల నుంచి రూ.1,376 కోట్లకు చేరుకున్నట్లు సీఎఫఓ నరసింహం తెలిపారు. భారత మార్కెట్ ఆదాయాలు కూడా 13 శాతం వృద్ధితో రూ.1,397 కోట్ల నుంచి రూ.1,578 కోట్లకు పెరిగినట్లు పేర్కొన్నారు. వర్ధమాన మార్కెట్ల ఆదాయాలు కూడా రూ.1,455 కోట్ల నుంచి రూ.1,654 కోట్లకు పెరిగాయి. కాగా కంపెనీ వద్ద రూ.2,750 కోట్ల మిగులు నిధులు ఉన్నాయని పేర్కొంది. అలాగే కొనుగోళ్లు, లైసెన్సింగ్ ఒప్పందాలపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించనున్నట్లు తెలిపింది. ఫార్మాపై అమెరికా సుంకాల ప్రభావం ప్రస్తుతానికైతే ఏమాత్రం లేదని సీఈఓ ఎరెజ్ ఇజ్రాయెలీ అన్నారు. అంతేకాకుండా సుంకాలకు సంబంధించి ఎలాంటి మార్గదర్శకాలు కూడా అందుకోలేదని ఆయన పేర్కొన్నారు. అయితే బయోలాజిక్స్‌పై ఈ ప్రభా వం ఎంత ఉంటుందనే విషయాన్ని మాత్రం పరిశీలించాల్సి ఉంటుందని ఇజ్రాయెలీ తెలిపారు. కాగా వచ్చే ఏడాది పేటెంట్ గడువు తీరనున్న మధుమేహం, ఊబకాయం చికిత్స లో వినియోగించే సెమాగ్లూటైడ్ ఔషధాన్ని భారత్ సహా పలు మార్కెట్లలోకి విడుదల చేయనున్నట్లు ఆయన చెప్పారు.

# వెండిని తాకట్టు పెట్టి లోన్ తీసుకోవచ్చా?



హైదరాబాద్ : అక్టోబర్ 27, 2025 : గత కొంతకాలంగా బంగారం, వెండి ధరలు భారీగా పెరుగుతున్నాయి. అయితే ఫ్యూచర్ లో బంగారం కంటే వెండికి ఎక్కువ డిమాండ్ ఉంటుందని వెండిలో పెట్టుబడులు పెట్టడం లాభదాయకం అని నిపుణులు కూడా సూచిస్తున్నారు. దీంతో వెండి గురించి పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఇకపై వెండిని తాకట్టు పెట్టి కూడా లోన్ తీసుకునేవిధంగా బ్యాంకులు నిర్ణయం తీసుకోనున్నట్టు మార్కెట్ వర్గాల్లో టాక్. దీని గురించి మరిన్ని వివరాల్లోకి వెళ్తే.. బంగారంతో పాటు వెండికి కూడా మార్కెట్ లో డిమాండ్ పెరుగుతోంది. ఆభరణాలతోపాటు పలు ఇండస్ట్రీల్లో కూడా వెండి వాడకం పెరుగుతుండడంతో ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా వెండి కొరత కూడా కనిపిస్తోంది. గడిచిన ఫెస్టివల్ సీజన్ లో కూడా బంగారంతోపాటు చాలామంది వెండి ఆభరణాలు, పూజా సామాగ్రి, ఇతర వెండి వస్తువులను బాగానే కొనుగోలు చేశారు. బంగారం ధర మితిమీరి పెరగడంతో జనం ఇప్పుడు వెండిని ఆల్టర్నేటివ్ గా చూస్తున్నారు. ఈ క్రమంలో ఫ్యూచర్ లో వెండి కూడా బంగారంలాగా ఒక స్థిరమైన సంపదగా మారే అవకాశం కనిపిస్తుంది. బ్యాంకులు కూడా ఇకపై వెండిపై లోన్స్ ఇస్తాయంటున్నారు. ఇటీవలి కాలంలో దేశంలో వెండి దిగుమతులు పెరిగాయి. ప్రభుత్వంతో పాటు పలు భారతీయ పరిశ్రమలు కూడా వెండిని కొనుగోలు చేస్తున్నాయి. సోలార్ విద్యుత్ ప్యానెల్స్, ఎలక్ట్రిక్ వాహనాలు, 5జీ కమ్యూనికేషన్ పరికరాలు, ఎలక్ట్రానిక్ భాగాలు వంటి రంగాల్లో వెండిని విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. ఈ రంగాల్లో పెరిగిన అవసరాల కారణంగా, అంతర్జాతీయ మార్కెట్లతో పోలిస్తే భారతదేశంలో వెండి ధరలు మరింత పెరిగిపోయాయి. అందుకే ప్రస్తుతం బంగారం లాగానే వెండికి కూడా స్థిరమైన సంపదగా స్థానం దక్కుతోంది. ఇది పెట్టుబడిదారులకు మరింత నమ్మకాన్ని కలిగిస్తూ, వెండిలో పెట్టుబడి పెట్టే అవకాశాలను విస్తరిస్తోంది. ఇప్పటివరకు బంగారు ఆభరణాలపై మాత్రమే బ్యాంకులు రుణాలు మంజూరు చేసేవి. కానీ త్వరలో వెండి ఆభరణాలను కూడా తాకట్టు పెట్టి రుణం పొందే అవకాశం అందుబాటులోకి రానుంది అని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఆర్ బీఐ (%=దీ×%) విడుదల చేసిన కొత్త మార్గదర్శకాల ప్రకారం.. 2026 ఏప్రిల్ 1 నుంచి వెండి ఆధారిత రుణాలు దేశవ్యాప్తంగా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. వెండి విలువను బట్టి లోన్ లిమిట్ నిర్ణయిస్తారు. కేవలం ఆభరణాలు, నగలు, నాణేలపైనే లోన్స్ తీసుకునే అవకాశం ఉంటుంది. వెండి బార్లు లేదా సిల్వర్ ఈటీఎఫ్‌లు తాకట్టు పెట్టి రుణం పొందడం సాధ్యం కాదు.

కర్నూలు ప్రమాదం ఎఫెక్ట్: ప్రయాణికుల సేఫ్టీకి

## తెలంగాణ ఆర్టీసీ పెద్దపీట



(మొదటి పేజీ తరువాయి) రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టింది. ప్రయాణికులకు సురక్షిత రవాణా సేవలు అందించేందుకు సంస్థ వైస్ చైర్మన్ (వీసీ) మరియు మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) నాగిరెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారు. సోమవారం ఆయన సంబంధిత అధికారులతో కలిసి మియాపూర్–1 డిపోను తనిఖీ చేశారు. మియాపూర్ –1 డిపోలోని లహరి స్లీపర్, లహరి ఏసీ స్లీపర్ కమ్ సీటర్, రాజధాని, సూపర్ లగ్జరీ బస్సులను పరిశీలించారు. ఈ బస్సుల్లో అమర్చబడిన ఫైర్ డిటెక్షన్ అలారం, ఫైర్ సప్రెషన్ సిస్టంల వంటి అగ్నిమాపక భద్రతా వ్యవస్థల పనితీరును స్వయంగా పర్యవేక్షించారు. అంతేకాకుండా, అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చేందుకు అనుసరించాల్సిన స్టాండర్డ్ ప్రోటోకాల్ పద్ధతులను సిబ్బంది, అధికారులతో సమీక్షించారు. బస్సుల్లో ఎమర్జెన్సీ డోర్లు, అద్దాలను పగలగొట్టేందుకు అవసరమైన సంఖ్యలో బ్రేకర్లు, అగ్నిమాపక పరికరాలు అన్ని వేళల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రయాణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డ్రైవర్లకు నాగిరెడ్డి పలు సూచనలు చేశారు. బస్సులు బయలుదేరే ముందు ప్రయాణికులకు వెల్కమ్ మెసేజ్‌తో పాటు సేఫ్టీకి సంబంధించిన వివరాలు కూడా తెలియజేయాలని సూచించారు. ఏదైనా ప్రమాదం సంభవించినట్లయితే, ముందుగా ప్రయాణికులను కాపాడే ప్రయత్నం చేయాలని తెలిపారు. ప్రయాణికులకు సురక్షితమైన రవాణా సేవలను నిరంతరం అందించేందుకు సిబ్బంది ఎల్లవేళలా కృషి చేయాల్సిన అవసరం ఉందని ఎండీ అన్నారు. తెలంగాణ ఆర్టీసీ సురక్షిత ప్రయాణాన్ని అందిస్తోందని, సేఫ్ జర్నీతోనే ఎంతోమంది జీవితాలు ఆధారపడి ఉంటాయి అన్న విషయాన్ని ఆర్టీసీ సిబ్బంది, డ్రైవర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ మరవకూడదని నాగిరెడ్డి ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# వాతావరణ మార్పుల బహుముఖ ప్రభావాలు

### – ఆహారం, నీరు, ఆరోగ్యం, ఆర్థిక వ్యవస్థలపై పెను సవాళు

భూతాపం పెరుగుదల, అసాధారణ వాతావరణ పరిస్థితులు నేడు ప్రపంచాన్ని చుట్టుముడుతున్న అతిపెద్ద సమస్య. ఇటీవల కాలంలో తరచుగా సంభవిస్తున్న వరదలు, రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు, తీవ్రమైన తుఫానులు వంటి విపత్తులు వాతావరణ మార్పుల వల్ల సంభవిస్తున్నవే. ఈ మార్పులు కేవలం పర్యావరణానికే పరిమితం కాకుండా, మానవ మనుగడకు అత్యంత కీలకమైన ఆహారం, నీరు, ఆరోగ్యం, ఆర్థిక వ్యవస్థలపై తీవ్రమైన బహుముఖ ప్రభావాన్ని చూపుతున్నాయి. వాతావరణ మార్పుల ప్రభావం మొదటగా ఆహార భద్రతపై పడుతోంది. అకాల వర్షాలు, దీర్ఘకాలిక కరువులు లేదా అధిక ఉష్ణోగ్రతలు పంటల దిగుబడిని తగ్గిస్తున్నాయి. ఉదాహరణకు, ఎండల తీవ్రత పెరిగితే వరి, గోధుమ వంటి ప్రధాన పంటల ఎదుగుదల దెబ్బతింటుంది. అలాగే, అనూహ్య తుఫానులు, వరదలు వచ్చి చేతికి వచ్చిన పంటను నాశనం చేస్తున్నాయి. దీని ఫలితంగా ఆహార కొరత ఏర్పడి, ధరలు పెరిగి, ముఖ్యంగా పేద వర్గాలపై భారం పెరుగుతోంది. మత్స్య సంపదపై ఆధారపడిన వారికి కూడా సముద్ర ఉష్ణోగ్రతలు పెరగడం, ఆమ్లత్వం పెరగడం వలన జీవనోపాధి కష్టమవుతోంది. దీని తరువాత, అతిపెద్ద సవాలు నీటి వనరుల లభ్యత. వాతావరణ మార్పుల కారణంగా కొన్ని ప్రాంతాల్లో అతివృష్టి, మరికొన్ని ప్రాంతాల్లో అనావృష్టి ఏర్పడుతోంది. హిమానీ నదాలు (గ్లేసియర్స్) వేగంగా కరిగిపోవడం వల్ల తాత్కాలికంగా నదులలో నీరు పెరిగినా, దీర్ఘకాలంలో అవి ఎండిపోయే ప్రమాదం ఉంది. వర్షపాతం సరళి మారడం వలన భూగర్భ జలాలు రీఛార్జ్ అవ్వడం తగ్గి, మంచినీటి కొరత తీవ్రమవుతోంది. ఒకవైపు వరదలతో నీరు కలుషితమై తాగడానికి పనికిరాకుండా పోతుంటే, మరోవైపు కరువు ప్రాంతాలలో నీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మానవ ఆరోగ్యంపై వాతావరణ మార్పుల ప్రభావం ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉంది. అధిక వేడి తరంగాల వలన వృద్ధులు, పిల్లలు, కార్మికులు వడదెబ్బ బారిన పడుతున్నారు. వరదలు, మురుగునీటి కాలుష్యం కారణంగా డెంగ్యూ, మలేరియా, కలరా వంటి నీటి ద్వారా వ్యాపించే మరియు దోమల ద్వారా సంక్రమించే వ్యాధులు పెరుగుతున్నాయి. పంటల వైఫల్యం, పోషకాహార లోపానికి దారితీసి, ప్రజల ఆరోగ్య వ్యవస్థలను బలహీనపరుస్తోంది. తీవ్రమైన వాతావరణ విపత్తులు మానసిక ఆరోగ్యంపైనా ప్రభావం చూపి, ఆందోళన, నిరాశకు గురిచేస్తున్నాయి. ఈ పరిణామాలన్నీ దేశ ఆర్థిక వ్యవస్థలపై పెనుభారాన్ని మోపుతున్నాయి. వరదలు, తుఫానుల వలన మౌలిక సదుపాయాలు (రోడ్లు, వంతెనలు, విద్యుత్ లైన్లు) ధ్వంసమవుతున్నాయి. వీటి పునర్నిర్మాణానికి వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. వ్యవసాయ రంగం దెబ్బతినడం వలన జీడీపీ వృద్ధి మందగిస్తుంది. బీమా కంపెనీలపై క్లెయిమ్‌ల భారం పెరగడం, పారిశ్రామిక ఉత్పత్తికి అంతరాయం కలగడం వంటివి ఆర్థిక కార్యకలాపాలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. పేదరికం, నిరుద్యోగం మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ బహుముఖ సవాళ్లను ఎదుర్కోవాలంటే, తక్షణమే నివారణ మరియు అనుగుణ్యత చర్యలు తీసుకోవాలి. శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గించి, పునరుత్పాదక ఇంధన వనరుల వైపు దృష్టి సారించడం నివారణ చర్య అవుతుంది. అదే సమయంలో, నీటి సంరక్షణ పద్ధతులు, కరువును తట్టుకునే పంట రకాలను అభివృద్ధి చేయడం, మెరుగైన ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను ఏర్పాటు చేయడం వంటివి అనుగుణ్యత చర్యల్లో భాగం. ముగింపులో, వాతావరణ మార్పులు కేవలం పర్యావరణ సమస్యగా కాకుండా, మన ఉనికినే ప్రశ్నించే సమగ్ర సంక్షోభంగా మారింది. దీని ప్రభావాలు ఆహారం, నీరు, ఆరోగ్యం, ఆర్థిక వ్యవస్థలపై వినాశకరంగా ఉన్నాయి. ఈ పెను సవాళ్లను ఎదుర్కోవడానికి ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు, పరిశ్రమలు, మరియు పౌరులు అందరూ సమిష్టిగా, తక్షణమే చర్యలు తీసుకోవాల్సిన చారిత్రక అవసరం ఎంతైనా ఉంది. భవిష్యత్ తరాలకు సురక్షితమైన ప్రపంచాన్ని అందించాలంటే, ఇప్పుడు మేల్కొనక తప్పదు.

# రక్షణ రంగంలో స్వావలంబన, శాంతి భద్రతల్లో చిత్తశుద్ధి



న్యూఢిల్లీ, అక్టోబర్ 27: భారతదేశం యొక్క భవిష్యత్తు, జాతీయ భద్రతకు సంబంధించిన రెండు కీలక అంశాలపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దృష్టి సారించారు. రక్షణ రంగంలో పూర్తి స్వావలంబన సాధించడం, అలాగే శాంతిభద్రతల నిర్వహణలో అధికారుల వృత్తిపరమైన చిత్తశుద్ధి దేశాభివృద్ధికి అత్యంత కీలకమని ఈ ఇద్దరు ప్రముఖులు ఉద్ఘాటించారు. దేశంలో 'వికసిత్ భారత్' (అభివృద్ధి చెందిన భారతదేశం) లక్ష్యాన్ని చేరుకోవడానికి ఈ రెండు స్తంభాలు బలోపేతం కావడం తప్పనిసరి అని వారి ప్రసంగాల సారాంశం తెలియజేస్తుంది. న్యూఢిల్లీలో జరిగిన సొసైటీ ఆఫ్ ఇండియన్ డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరర్స్ వార్షిక సదస్సులో రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ, దేశీయ రక్షణ పరిశ్రమకు కీలక మార్గదర్శకాలను అందించారు. 'రక్షణ రంగంలో స్వావలంబన' అనే నేపథ్యంతో జరిగిన ఈ సదస్సులో ఆయన, సవాళ్లను ఎదుర్కోవడానికి ఆత్మనిర్భరతే ఏకైక మార్గమని స్పష్టం చేశారు. రక్షణ పరికరాలను కేవలం 'అసెంబుల్' చేయడమే కాకుండా, వాటిలో ఉపయోగించే విడి భాగాలు మరియు ఉప-వ్యవస్థల తయారీపై పరిశ్రమలు దృష్టి పెట్టాలని ఆయన కోరారు. తద్వారా, నిర్వహణ మరియు సరఫరా గొలుసులలో విదేశీయులపై ఆధారపడటాన్ని పూర్తిగా తగ్గించాలని పిలుపునిచ్చారు. దేశం యొక్క రక్షణ ఎగుమతుల వృద్ధి వేగాన్ని ప్రస్తావిస్తూ, మార్చి 2026 నాటికి రక్షణ ఎగుమతులను 30,000 కోట్లకు చేర్చడానికి భారత్ సిద్ధంగా ఉందని రక్షణ మంత్రి ధీమా వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వం 'మేడ్ ఇన్ ఇండియా, మేడ్ ఫర్ ది వరల్డ్' అనే స్ఫూర్తితో ఒక నిజమైన ఉత్పాదక స్థావరాన్ని ఏర్పాటు చేయడానికి కృషి చేస్తోందని ఆయన తెలిపారు. ప్రైవేట్ రంగం మరింత చురుకుగా పాలుపంచు కుంటూ, పెద్దఎత్తున అంత ర్జాతీయ ప్రమాణాలకు అను గుణంగా ఉత్పత్తులను తయారు చేయాలని, తద్వా రా భారతదేశాన్ని రక్షణ తయారీ కేంద్రంగా మార్చా లని ఆయన ఆకాంక్షించారు. మరోవైపు, రాష్ట్రపతి భవన్‌లో ఇండియన్ పోలీస్ సర్వీస్ 77వ బ్యాచ్ (2024 ఆర్ఆర్) ప్రొబేషనర్లను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించారు. శాంతిభద్రతలు మరియు పౌరుల రక్షణ రంగంలో కీలక పాత్ర పోషించబోయే ఈ యువ అధికారులకు ఆమె విలువైన సలహానిచ్చారు. పోలీస్ అధికారులు చట్టం నుంచి అధికారాలను పొందినప్పటికీ, వారి నిజమైన అధికారం, శక్తి వ్యక్తిగత, వృత్తిపరమైన చిత్తశుద్ధి నుంచే వస్తుందని రాష్ట్రపతి స్పష్టం చేశారు. యువ అధికారుల నేతృత్వంలోని 'భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న పోలీస్ వ్యవస్థ' రాబోయే కాలంలో 'వికసిత్ భారత్' నిర్మాణంలో ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని ఆమె ఉద్ఘాటించారు. చిత్తశుద్ధి, నిబద్ధతతో కూడిన సేవ ద్వారా ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకోవడం అత్యంత ముఖ్యమని ఆమె వారికి సూచించారు.

## పోషకాహార లోపం సవాళ్లు, పరిష్కారాలు



పోషకాహార లోపం అంటే కేవలం ఆకలి కాదు అది ఆరోగ్యానికి అవసరమైన సక్రమమైన పోషక పదార్థాలు అందకపోవడం. మన దేశంలో ఇది ఇంకా తీవ్రమైన సామాజిక సమస్యగా కొనసాగుతోంది. పిల్లలు, గర్భిణీలు, వృద్ధులు, పేదవర్గాల ప్రజలు దీనికి ఎక్కువగా గురవుతున్నారు. ఐక్యరాజ్యసమితి గణాంకాల ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం కోట్లాది మంది పిల్లలు పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశంలో ఇది మరింత గంభీరమైన సవాలు. మన శరీరానికి అవసరమైన ప్రోటీన్, విటమిన్లు, ఖనిజ లవణాలు, కొవ్వులు, కర్బోహైడ్రేట్లు సరైన మోతాదులో అందకపోవడమే పోషకాహార లోపం. దీని ఫలితంగా శరీర వికాసం, రోగనిరోధక శక్తి, మానసిక అభివృద్ధి అంతరాయానికి లోనవుతాయి. పిల్లల్లో ఇది శారీరక ఎదుగుదలను మందగింప జేస్తుందిబీ గర్భిణీల్లో తక్కువ బరువుతో పిల్లలు పుట్టే ప్రమాదం పెరుగుతుంది. భారతదేశం పోషకాహార లోపంతో పోరాడుతున్న దేశాలలో ఒకటి. "నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే)" ప్రకారం, 5 సంవత్సరాల లోపు పిల్లల్లో సుమారు 35% మంది తక్కువ బరువుతో ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ శాతం మరింత ఎక్కువ. పేదరికం, నిరక్షరాస్యత, తల్లిదండ్రుల అవగాహన లేకపోవడం, శుభ్రమైన నీరు లేకపోవడం ు ఇవన్నీ ప్రధాన కారణాలు. మహిళలు, ముఖ్యంగా గర్భిణీలు మరియు పాలిచ్చే తల్లులు, పోషకాహార లోపానికి అత్యంత ప్రమాదంలో ఉన్న వర్గం. గర్భధారణ సమయంలో సరైన ఆహారం అందకపోతే తల్లీబిడ్డల ఆరోగ్యం రెండూ ప్రమాదంలో పడతాయి. ఇనుము, కాల్షియం, ఫోలిక్ యాసిడ్ వంటి మూలపదార్థాల లోపం వల్ల రక్తహీనత (అనీమియా) విస్తరిస్తోంది. ఈ సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వ పథకాలు ఉన్నా అవి ప్రతి మూలకు చేరడం లేదు. పిల్లలలో పోషకాహార లోపం అంటే భవిష్యత్తు తరాల బలహీనత. ఇది వారి మేధస్సు, అభ్యాస సామర్థ్యం, శారీరక ఎదుగుదలను ప్రభావితం చేస్తుంది. పాఠశాలలో హాజరు తగ్గడం, విద్యలో వెనుకబాటు రావడం వంటి సమస్యలు కూడా దీని దుష్పరిణామాలు. ఒక బలహీన శరీరంతో పిల్లవాడు దేశ భవిష్యత్తును నిర్మించలేడు ు కాబట్టి ఇది కేవలం వ్యక్తిగత సమస్య కాదు, జాతీయ సమస్య. భారత ప్రభుత్వం "పోషణ్ అభియాన్", "మిడ్-డే మీల్ స్కీమ్", "అంగన్‌వాడీ సేవలు" వంటి పథకాలను అమలు చేస్తోంది. వీటి ద్వారా గర్భిణీలకు, పిల్లలకు, పేదవర్గాలకు పోషకాహారం అందించడానికి ప్రయత్నిస్తోంది. అయితే ఈ పథకాలు కాగితాల మీద కాకుండా నేలస్థాయిలో సమర్థంగా అమలవ్వాలి. పర్యవేక్షణ వ్యవస్థ బలంగా ఉండాలి. పోషకాహార లోపాన్ని తగ్గించడానికి కేవలం ప్రభుత్వమే కాదు, సమాజం మొత్తం భాగస్వామ్యం కావాలి. ప్రజల్లో పోషకాహారంపై అవగాహన పెంచడం, పాఠశాలలలో పోషక విద్య బోధించడం, స్థానికంగా లభ్యమయ్యే ఆహార పదార్థాలతో సమతుల్య ఆహారం తయారు చేయడం వంటి చర్యలు తీసుకోవాలి. రైతులు కూడా పోషక విలువలున్న పంటల సాగు వైపు దృష్టి సారించాలి. పోషకాహార లోపం అనేది మన సమాజం యొక్క ఆరోగ్య సూచిక. ఒక దేశం ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి పౌరుడు బలంగా ఉండాలి. ఈ సమస్యను పరిష్కరించడం ద్వారా మాత్రమే మనం ఆర్థిక, సామాజిక అభివృద్ధిని సాధించగలం. పోషకాహారం అంటే ఖరీదైన ఆహారం కాదు. సంతులితమైన ఆహారం. అందుకే ప్రతి కుటుంబం "ఆహారం అంటే ఆరోగ్యం" అనే భావనను అర్థం చేసుకోవాలి. అవగాహనతో, చర్యలతో, సహకారంతో పోషకాహార లోపం అనే సమస్యను మనం తప్పక జయించగలం.

# ఉపాధ్యాయుల శిక్షణలో టెక్నాలజీ పాత్ర



విద్య అనేది సమాజ అభివృద్ధికి మూలస్తంభం. కానీ విద్యా వ్యవస్థ బలపడాలంటే దాని కేంద్రబిందువైన ఉపాధ్యాయుడు బలంగా ఉండాలి. గతంలో ఉపాధ్యాయుడు బ్లాక్‌బోర్డు, పుస్తకం, మరియు శ్రద్ధగల విద్యార్థులపై ఆధారపడి బోధించేవాడు. కానీ ఇప్పుడు కాలం మారింది. టెక్నాలజీ ప్రతి తరగతి గదిలోకి ప్రవేశించింది. ఈ పరిణామం మధ్యలో "ఉపాధ్యాయుల శిక్షణ" అనే అంశం అత్యంత కీలకమైంది. కొత్త సాంకేతిక పరిజ్ఞానం ఎలా ఉపయోగించాలో, ఎలా బోధనలో విలీనం చేయాలో తెలుసుకోవడం ఇప్పుడు ప్రతి ఉపాధ్యాయుడికి అవసరమైంది. టెక్నాలజీ శిక్షణ అంటే కేవలం కంప్యూటర్ వాడటం నేర్చుకోవడమే కాదు. అది ఒక దృక్పథ మార్పు. ఒక ఉపాధ్యాయుడు టెక్నాలజీ ద్వారా విద్యార్థులతో ఎలా అనుసంధానం కావాలో, బోధనను ఎంత ఆసక్తికరంగా, అనుభవాత్మకంగా చేయాలో అర్థం చేసుకోవాలి. ఉదాహరణకు ు వీడియో పాఠాలు, వర్చువల్ ల్యాబ్‌లు, డిజిటల్ క్విజ్‌లు వంటి పద్ధతులు బోధనను మరింత జీవంతో నింపుతున్నాయి. అయితే ఇవన్నీ సమర్థవంతంగా వాడాలంటే ఉపాధ్యాయుడు సరైన శిక్షణ పొందాలి. భారతదేశంలో ప్రభుత్వాలు, విద్యాసంస్థలు ఉపాధ్యాయుల శిక్షణలో టెక్నాలజీని ప్రాధాన్యతనిస్తున్నాయి. వంటి ప్లాట్‌ఫారమ్‌లు ఈ దిశలో తీసుకున్న ముఖ్యమైన అడుగులు. వీటి ద్వారా ఉపాధ్యాయులు తమ సబ్జెక్ట్‌లో కొత్త పద్ధతులు నేర్చుకోవడమే కాకుండా దేశంలోని ఇతర ఉపాధ్యాయులతో అనుభవాలు పంచుకోవచ్చు. ఈ ప్లాట్‌ఫారమ్‌లు ఉపాధ్యాయుడిని నిరంతర అభ్యాసానికి ప్రోత్సహిస్తున్నాయి. అయితే, అన్ని ప్రాంతాల్లో ఈ మార్పు సమానంగా జరగడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ లభ్యత లేకపోవడం, అవసరమైన పరికరాలు అందుబాటులో లేకపోవడం ఒక పెద్ద అడ్డంకి. అనేక మంది ఉపాధ్యాయులు టెక్నాలజీ వాడటానికి వెనుకంజ వేస్తున్నారు. కొత్తదాన్ని భయపడటం, వయస్సు కారణంగా అభ్యాసానికి ఇష్టపడకపోవడం వంటి కారణాలు ఉన్నాయి. అందుకే టెక్నాలజీ శిక్షణ కార్యక్రమాలు మరింత స్నేహపూర్వకంగా, సులభంగా ఉండాలి. టెక్నాలజీ శిక్షణలో ప్రాక్టికల్ లెర్నింగ్‌కి ప్రాధాన్యత ఇవ్వాలి. ఉపాధ్యాయులు కేవలం సిద్ధాంతం వినడమే కాదు, స్వయంగా డిజిటల్ పాఠాలు తయారు చేయడం, ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించడం, విద్యార్థుల పనిని ఆన్‌లైన్‌లో అంచనా వేయడం వంటి అనుభవాలు పొందాలి. ఈ విధంగా శిక్షణ ఇవ్వడం ద్వారా వారు నిజజీవిత బోధనలో ఆత్మవిశ్వాసంగా మారతారు. టెక్నాలజీతో కూడిన శిక్షణలో సహకార బోధన కూడా ఒక కొత్త మార్గం తెరిచింది. ఉపాధ్యాయులు తమ పాఠశాలలకే పరిమితం కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న విద్యావేత్తలతో ఆలోచనలు పంచుకోవచ్చు. ఈ పద్ధతి ద్వారా కొత్త బోధనా వ్యూహాలు, క్రియాశీల పద్ధతులు పుట్టుకొస్తాయి. ఈ అనుసంధానం విద్యను ఒక ప్రపంచవ్యాప్త అనుభవంగా మార్చుతోంది. టెక్నాలజీ శిక్షణ వల్ల విద్యార్థులలో కూడా పరోక్ష ప్రభావం కనిపిస్తుంది. టెక్-సావీ ఉపాధ్యాయుడు బోధిస్తే విద్యార్థులు కూడా ఆత్మవిశ్వాసంతో కొత్త విషయాలు నేర్చుకుంటారు. క్లాస్‌రూమ్ బోధన, డిజిటల్ టూల్స్, ప్రాజెక్ట్ ఆధారిత లెర్నింగ్ కలిపి ఒక సమగ్ర అభ్యాస వాతావరణం ఏర్పడుతుంది. ఇది 21వ శతాబ్దపు విద్యా అవసరాలకు తగిన మార్గం. ఈ పద్ధతి ద్వారా కొత్త బోధనా వ్యూహాలు, క్రియాశీల పద్ధతులు పుట్టుకొస్తాయి. ఈ అనుసంధానం విద్యను ఒక ప్రపంచవ్యాప్త అనుభవంగా మార్చుతోంది. టెక్నాలజీ శిక్షణ వల్ల విద్యార్థులలో కూడా పరోక్ష ప్రభావం కనిపిస్తుంది. టెక్-సావీ ఉపాధ్యాయుడు బోధిస్తే విద్యార్థులు కూడా ఆత్మవిశ్వాసంతో కొత్త విషయాలు నేర్చుకుంటారు. క్లాస్‌రూమ్ బోధన, డిజిటల్ టూల్స్, ప్రాజెక్ట్ ఆధారిత లెర్నింగ్ కలిపి ఒక సమగ్ర అభ్యాస వాతావరణం ఏర్పడుతుంది. మొత్తానికి, ఉపాధ్యాయుల శిక్షణలో టెక్నాలజీ పాత్ర ఒక మార్గదర్శక దీపంలాంటిది. ఉపాధ్యాయుడు కేవలం జ్ఞానం బోధించే వ్యక్తి కాదు ఆయన ఒక శాశ్వత అభ్యాసకుడు. టెక్నాలజీ అతనికి నూతన ఆలోచనలకి, సృజనాత్మకతకి తలుపులు తెరుస్తుంది. అందుకే ప్రతి ప్రభుత్వం, ప్రతి విద్యా సంస్థ ఉపాధ్యాయుల టెక్నాలజీ శిక్షణను ఒక పెట్టుబడి లా చూడాలి. ఎందుకంటే శిక్షణ పొందిన ఉపాధ్యాయుడు సమాజ భవిష్యత్తును మార్చగల శక్తి కలవాడు. అయితే, ఈ సాంకేతిక విప్లవంలో కొన్ని సవాళ్లు లేకపోలేదు. గ్రామీణ ప్రాంతాలలో మౌలిక సదుపాయాల కొరత అంటే నిలకడ లేని ఇంటర్నెట్ సౌకర్యం, పాత కంప్యూటర్లు వంటి సమస్యలు ఉన్నాయి. ఈ అడ్డంకులను అధిగమించడాx టానికి, ప్రభుత్వాలు మరియు విద్యాసంస్థలు డిజిటల్ మౌలిక వసతులను బలోపేతం చేయడం మరియు ఉపాధ్యాయులందరికీ సమాన అవకాశాలు కల్పించడం చాలా ముఖ్యం. టెక్నాలజీ పాత్ర కేవలం బోధనకే పరిమితం కాదు, ఉపాధ్యాయులు నిరంతర వృత్తిపరమైన అభివృద్ధిని పొందడానికి కూడా ఇది తోడ్పడుతుంది. ఆన్‌లైన్ కమ్యూనిటీలు మరియు పీర్-టు-పీర్ లెర్నింగ్ ద్వారా, ఉపాధ్యాయులు తమ సహచరులతో అనుభవాలను పంచుకోవచ్చు, కొత్త ఆలోచనలను చర్చించవచ్చు మరియు సమస్యలకు పరిష్కారాలను కనుగొనవచ్చు. ఇది ఉపాధ్యాయులు ఎల్లప్పుడూ అప్‌డేట్‌గా ఉండటానికి సహాయపడుతుంది. మొత్తంమీద, ఉపాధ్యాయుల శిక్షణలో టెక్నాలజీ అనేది ఒక సాధనం మాత్రమే కాదు, విద్యా నాణ్యతను పెంచే ఒక ఉత్ప్రేరకం . ఉపాధ్యాయులు టెక్నాలజీని సమర్థవంతంగా వినియోగించుకోవడం నేర్చుకుంటే, వారు విద్యార్థులను భవిష్యత్తు సవాళ్లకు సిద్ధం చేయగల సమర్థవంతమైన పౌరులుగా తీర్చిదిద్దుతారు. కాబట్టి, టెక్నాలజీ ఆధారిత శిక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం అనేది నాణ్యమైన విద్యకు మరియు దేశ భవిష్యత్తుకు శుభసూచకం.

# అమెరికా కఠిన చర్యలు

### – 'డంకీ రూట్' ద్వారా అక్రమంగా ప్రవేశించిన 54 మంది భారతీయులు బహిష్కరణ

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 27:



అమెరికాలో అక్రమ వలసలపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం ఉక్కుపాదం మోపుతున్న నేపథ్యంలో, "డంకీ రూట్" ద్వారా దేశంలోకి ప్రవేశించారనే ఆరోపణలపై 54 మంది భారతీయులను అమెరికా బహిష్కరించింది. స్వదేశానికి వెనక్కి పంపబడిన వారిలో అధికశాతం హర్యాణా రాష్ట్రానికి చెందిన యువకులే కావడం గమనార్హం. బహిష్కరణకు గురైన వారిలో 16 మంది కర్నాల్‌కు చెందినవారు, 15 మంది కైతాల్‌కు చెందినవారు ఉన్నారు. అలాగే అంబాలా (5), యమునా నగర్ (4), కురుక్షేత్ర (4), జింద్ (3), సోనిపట్ (2), పంచకుల, పానిపట్, రోహ్తక్, ఫతేహాబాద్ నుంచి ఒక్కొక్కరు ఉన్నారు. వీరంతా 25 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు వారేనని, ఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నట్లు పోలీసులు ధ్రువీకరించారు. ఈ 54 మంది అక్రమంగా 'డంకీ రూట్' ద్వారా అమెరికాలోకి ప్రవేశించినట్లు కర్నాల్ డీఎస్పీ సందీప్ కుమార్ తెలిపారు. బహిష్కరణకు గురైన వారందరినీ పోలీసుల ద్వారా వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అక్రమ వలసలపై కఠిన నిబంధనలు అమలు చేస్తున్నారు. అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న వారిని గుర్తించి పెద్ద సంఖ్యలో స్వదేశాలకు పంపిస్తున్నారు. ఈ ఏడాది కూడా వేల సంఖ్యలో అక్రమవలసదారులను దేశం నుంచి బహిష్కరించినట్లు సమాచారం.

# మన ఉత్పత్తి – మన గౌరవం – మన ఆర్థిక శక్తి!

## – ప్రపంచ మార్కెట్‌లో అవకాశాలు

ప్రపంచీకరణ యుగంలో మనం అనేక విదేశీ ఉత్పత్తులపై ఆధారపడి ఉన్నాం. కానీ ఇటీవల కాలంలో అనే ఆలోచన కొత్త దిశ చూపించింది. ఇది కేవలం ఒక నినాదం కాదు. స్వదేశీ ఉత్పత్తులు, హస్తకళలు, చిన్న వ్యాపారాలకు మద్దతు ఇచ్చే జాతీయ ఆర్థిక ఉద్యమం. దీని ప్రధాన లక్ష్యం భారతీయ ఆర్థిక వ్యవస్థను స్వావలంబన దిశగా నడిపించడం. స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా దేశం ఆర్థికంగా బలపడటమే కాక, సాంస్కృతికంగా కూడా గర్వపడే స్థితికి చేరుతుంది. అనే నినాదాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గారు "ఆత్మనిర్భర్ భారత్" పిలుపు సమయంలో ఇచ్చారు. దీని వెనుక ఉద్దేశ్యం. మన దేశ ప్రజలు తమ ప్రాంతీయ ఉత్పత్తులు, కళలు, వస్తువులను ఉపయోగించి వాటిని ప్రపంచ మార్కెట్‌లోకి తీసుకెళ్లడం. స్థానిక ఉత్పత్తులకు మద్దతు ఇవ్వడం అంటే కేవలం పాత సంప్రదాయాన్ని గౌరవించడం కాదు అది దేశ ఆర్థిక స్వేచ్ఛకు బాటలు వేయడం. స్థానిక వ్యాపారాలు బలపడితే దేశంలో ఉద్యోగావకాశాలు పెరుగుతాయి. చిన్న పరిశ్రమలు, హస్తకళాకారులు, గ్రామీణ ఉత్పత్తిదారులు తమ వస్తువులను అమ్ముకునే అవకాశాలు పొందుతారు. విదేశీ దిగుమతులపై ఆధారపడకపోవడం వల్ల దేశపు డబ్బు దేశంలోనే తిరుగుతుంది. ఇది పెరుగుదల, గ్రామీణ అభివృద్ధి, మధ్యతరగతి బలపాటు వంటి అంశాలకు తోడ్పడుతుంది. భారతదేశం హస్తకళలలో ప్రపంచ ప్రసిద్ధి పొందిన దేశం. బనారసీ సిల్క్, పోచంపల్లి ఇక్కత్, కొండపల్లి బొమ్మలు, తిరుప్పూర్ కాటన్, మధుబని పెయింటింగ్ ఇవి కేవలం వస్తువులు కాదు, భారతీయ సంస్కృతి ప్రతిరూపాలు. కానీ యాంత్రిక ఉత్పత్తుల ప్రభావంతో వీటికి మార్కెట్ తగ్గిపోయింది. ఉద్యమం ఈ కళలకు కొత్త ఊపిరి నిస్తోంది. ప్రభుత్వం గుర్తింపు, హస్తకళా మేళాలు, ఆన్‌లైన్ మార్కెట్లు ద్వారా ఈ కళలను ప్రపంచానికి పరిచయం చేస్తోంది. స్వావలంబన అంటే మన అవసరాలను మనమే తీర్చుకోవడం. ఆర్థికంగా బలపడటానికి ఇది అత్యంత అవసరం. చైనా వంటి దేశాలు తమ స్థానిక ఉత్పత్తులను ప్రపంచ స్థాయికి చేర్చి ఆర్థిక శక్తిగా ఎదిగాయి. అదే మార్గంలో భారతదేశం కూడా నడుస్తోంది. మనం దేశీయ ఉత్పత్తులను కొనడం, వాటిని ప్రోత్సహించడం ద్వారా దేశభక్తి మరియు ఆర్థిక బలం రెండింటినీ ప్రదర్శిస్తున్నాం. భారతదేశంలోని స్థానిక ఉత్పత్తులు మరియు హస్తకళలు విదేశీ మార్కెట్లలో పెద్ద డిమాండ్ పొందుతున్నాయి. వంటి కార్యక్రమాల ద్వారా ప్రతి జిల్లాలోని ప్రత్యేక ఉత్పత్తిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడం జరుగుతోంది. ఉదాహరణకు, ఆంధ్రప్రదేశ్‌లోని ఉప్పాడ హ్యాండ్‌లూమ్స్, తెలంగాణలోని చెరియాల్ స్క్రోల్స్ ఇప్పుడు విదేశీ మార్కెట్‌లలో కూడా అమ్ముడవుతున్నాయి. ఇది గ్రామీణ కళాకారుల జీవనోపాధికి కొత్త దారులు తెరిచింది. అయితే, స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించడంలో కొన్ని సవాళ్లు ఉన్నాయి. మార్కెటింగ్ లోపం, ఆర్థిక సహకారం లేమి, మధ్యవర్తుల ఆధిపత్యం వంటి సమస్యలు. వీటిని పరిష్కరించడానికి ప్రభుత్వం మరియు ప్రైవేట్ రంగం కలసి పనిచేయాలి. డిజిటల్ మార్కెట్లలో స్థానిక బ్రాండ్లకు ప్రాధాన్యం ఇవ్వడం, ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లువిభాగాలు పెంచడం అవసరం. అనేది కేవలం ఆర్థిక సూత్రం కాదు అది ఒక జాతీయ బాధ్యత. ప్రతి భారతీయుడు స్థానిక ఉత్పత్తులను ఉపయోగించి, వాటి గురించి గర్వంగా చెప్పాలి. ఇది మన కళాకారులకు జీవనాధారం, దేశానికి ఆర్థిక బలం, ప్రపంచానికి భారతీయత యొక్క గుర్తు. స్వావలంబనతో కూడిన స్థానికతే మన భవిష్యత్తు మార్గం

# శ్రేయస్ అయ్యర్‌కు గాయంతో ఆసుపత్రి చేరిక



ముంబై : ఆస్ట్రేలియాతో జరిగిన మూడో వన్డేలో భారత బ్యాట్స్‌మన్ శ్రేయస్ అయ్యర్‌కు గాయమైంది. సిడ్నీ మైదానంలో ఫీల్డింగ్ చేస్తుండగా వేగంగా వచ్చే బంతిని ఆపే ప్రయత్నంలో ఆయన విరిగిపడ్డాడు. ఈ సమయంలో ఛాతీ వద్ద బలంగా తగిలిన బంతి కారణంగా తీవ్రమైన నొప్పితో బాధపడుతూ మైదానం విడిచి వెళ్లాల్సి వచ్చింది. వెంటనే వైద్య సిబ్బంది ఆయన్ను సమీప ఆసుపత్రికి తరలించారు. వైద్య పరీక్షల అనంతరం "స్ప్లీన్ లేసరేషన్" అనే గాయమని నిర్ధారించారు. ఇది అంతర్గత అవయవ గాయం కావడంతో వైద్యులు మరికొన్ని రోజులు విశ్రాంతి అవసరమని సూచించారు. బీసీసీఐ ప్రతినిధులు ఈ సంఘటనపై స్పందిస్తూ, అయ్యర్ ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని, పూర్తి స్థాయిలో కోలుకునేందుకు సమయం పట్టవచ్చని తెలిపారు. భారత జట్టు యాజమాన్యం ఆయన స్థానంలో ఎవరు రానున్నారనే విషయాన్ని ఇంకా ప్రకటించలేదు. రాబోయే టెస్ట్ సిరీస్‌కి అయ్యర్ అందుబాటులో ఉంటారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత ఏడాది నుంచి పలు గాయాలతో ఇబ్బంది పడుతున్న ఆయనకు ఇది మరో దెబ్బగా మారింది. క్రికెట్ అభిమానులు సోషల్ మీడియాలో ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నారు. "గెట్ వెల్ సూన్ అయ్యర్" అనే హ్యాష్‌ట్యాగ్ ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది.

# ఏఐఎఫ్‌ఎఫ్ సూపర్ కప్ 2025 – 26 ఘనంగా ప్రారంభం




భువనేశ్వర్ : భారత ఫుట్‌బాల్ ప్రపంచంలో ఎంతో ప్రాధాన్యం ఉన్న ఏఐఎఫ్‌ఎఫ్ సూపర్ కప్ 2025-26 సీజన్ భువనేశ్వర్‌లో ఘనంగా ప్రారంభమైంది. ఈ టోర్నమెంట్ అక్టోబర్ 25న ప్రారంభమై నవంబర్ 22 వరకు కొనసాగనుంది. దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ ఫుట్‌బాల్ క్లబ్‌లు ఈ సీజన్‌లో పోటీ పడుతున్నాయి. ప్రారంభ మ్యాచ్‌లో కేరళ బ్లాస్టర్స్ జట్టు, బెంగళూరు ఎఫ్‌సీపై 2-1 గోల్స్ తేడాతో విజయాన్ని సాధించింది. ఆరంభం నుంచే ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో కేరళ ఆటగాడు సహల్ అబ్దుల్ సమాద్ అద్భుత గోల్ సాధించి ప్రేక్షకులను ఉత్సాహపరిచాడు. చివర్లో బెంగళూరు జట్టు సమీకరించడానికి ప్రయత్నించినా, కేరళ గోల్‌కీపర్ గిల్ అద్భుత సేవ్‌లతో జట్టును గెలుపు దిశగా నడిపించాడు. ఈ సీజన్‌లో ఐఎస్‌ఎల్, ఐ-లీగ్ నుంచి 16 జట్లు పాల్గొంటున్నాయి. లీగ్ ఫార్మాట్‌లో జరిగే ఈ టోర్నమెంట్‌లో టాప్ నాలుగు జట్లు నాకౌట్ దశకు అర్హత సాధిస్తాయి. ఫైనల్ మ్యాచ్ నవంబర్ 22న జరుగనుంది. ఏఐఎఫ్‌ఎఫ్ అధ్యక్షుడు కాళ్యాణ్ చౌబే మాట్లాడుతూ, "ఫుట్‌బాల్ భారతదేశంలో వేగంగా ఎదుగుతోంది. ఈ సూపర్ కప్ ద్వారా దేశీయ ఆటగాళ్లకు అంతర్జాతీయ స్థాయి అనుభవం లభిస్తుంది" అని అన్నారు. భారత ఫుట్‌బాల్ అభిమానులు ఈ టోర్నమెంట్‌ను ఉత్సాహంగా స్వాగతిస్తున్నారు. ముఖ్యంగా కేరళ, గోవా, మణిపూర్ రాష్ట్రాల్లో ఫుట్‌బాల్ అభిమానులు స్టేడియాలను నింపేస్తున్నారు. ఈ సీజన్‌లో కొత్త ప్రతిభావంతులైన ఆటగాళ్లు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని క్రీడా నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# భారత్ విజయం సాధించినా బ్యాటింగ్‌పై ఆందోళన



చెన్నై : ఆస్ట్రేలియాతో జరిగిన మూడో వన్డేలో భారత్ విజయం సాధించినా, బ్యాటింగ్ విభాగం ప్రదర్శనపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సిడ్నీ మైదానంలో జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ 5 వికెట్ల తేడాతో గెలిచి సిరీస్‌ను 2-1 తేడాతో ముగించింది. అయినప్పటికీ ముందు రెండు మ్యాచ్‌ల్లో భారత్ ఘోరంగా ఓడిపోవడం అభిమానుల్లో ఆందోళన కలిగించింది. ఈ మ్యాచ్‌లో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలు అద్భుతంగా ఆడినా, మధ్య వరుస బ్యాట్స్‌మన్‌లు మళ్లీ విఫలమయ్యారు. ముఖ్యంగా సూర్యకుమార్ యాదవ్ మరియు సంజూ శాంసన్‌లు తక్కువ స్కోరుకే ఔట్ అవ్వడం జట్టు సమతౌల్యాన్ని దెబ్బతీసింది. స్పిన్నర్ల బౌలింగ్‌తో భారత్ మ్యాచ్‌ను తిరిగి తమ పట్టు లోకి తెచ్చుకుంది. కుల్‌దీప్ యాదవ్ కీలక సమయంలో మూడు వికెట్లు తీసి విజయంలో ప్రధాన పాత్ర పోషించాడు. కెప్టెన్ రోహిత్ శర్మ మ్యాచ్ అనంతరం మాట్లాడుతూ, జట్టు బ్యాటింగ్‌లో ఇంకా స్థిరత్వం కావాలని స్పష్టం చేశారు. "మేము గెలిచినా, టాప్ ఆర్డర్ తప్ప మిగతా ఆటగాళ్లు తమ బాధ్యతను సరిగా నిర్వర్తించలేదు. ఇది రాబోయే సిరీస్‌లకు సవాల్‌గా తీసుకోవాలి" అని ఆయన అన్నారు. విశ్లేషకులు కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తక్షణం జట్టులో మార్పులు చేసి, యువ ఆటగాళ్లకు అవకాశాలు ఇవ్వాలని సూచిస్తున్నారు. ఇక ఆస్ట్రేలియా పక్షాన స్టార్క్, హేజిల్‌వుడ్ బౌలింగ్‌లో మెరుగ్గా రాణించారు. ఈ సిరీస్ ముగిసిన తర్వాత రెండు జట్లు వచ్చే నెలలో టి20 సిరీస్‌లో తలపడనున్నాయి.

# మహిళల వరల్డ్‌కప్ సెమీఫైనల్‌కు ముందు భారత ఓపెనర్‌కు గాయం



వెల్లింగ్టన్ : ఐసీసీ మహిళల వన్డే ప్రపంచకప్‌లో సెమీఫైనల్ మ్యాచ్‌కు ముందు భారత జట్టుకు షాక్ తగిలింది. టీమిండియా ఓపెనర్ ప్రతికా రావల్ న్యూజిలాండ్‌తో జరిగిన లీగ్ మ్యాచ్‌లో గాయపడి ఆసుపత్రిలో చేరారు. వెల్లింగ్టన్ మైదానంలో ఫీల్డింగ్ చేస్తుండగా, ఆమె పరుగెత్తుతూ బౌండరీ లైన్ వద్ద బంతిని ఆపే ప్రయత్నంలో తడబడి కాలి మడమకు తీవ్ర గాయం అయ్యింది. తీవ్ర నొప్పితో బాధపడుతున్న ప్రతికాను వెంటనే వైద్య బృందం పరీక్షించి సమీప ఆసుపత్రికి తరలించింది. స్కాన్ రిపోర్ట్‌ల ప్రకారం, ఆమె మడమకు లిగమెంట్ ఇంజరీగా నిర్ధారణ అయింది. కనీసం రెండు వారాల విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించారు. దీంతో రాబోయే ఆస్ట్రేలియాతో జరిగే సెమీఫైనల్ మ్యాచ్‌లో ఆమె పాల్గొనడం అనుమానాస్పదమైంది. భారత జట్టు కోచ్ రమేశ్ పవార్ మాట్లాడుతూ, "ప్రతికా జట్టుకు కీలక ఆటగాడు. ఆమె లేని లోటు తప్పక ఉంటుంది. అయినప్పటికీ మిగతా ఆటగాళ్లు ఆమె స్థానాన్ని భర్తీ చేయడానికి ప్రయత్నిస్తారు" అని తెలిపారు. ప్రతికా ఈ టోర్నమెంట్‌లో ఇప్పటివరకు నాలుగు ఇన్నింగ్స్‌లలో 230 పరుగులు చేసి జట్టుకు బలమైన ఆరంభం అందించారు. ప్రతికా గాయం వార్త వెలువడిన వెంటనే అభిమానులు సోషల్ మీడియాలో ఆమెకు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నారు. "గెట్ వెల్ సూన్ ప్రతికా" అనే హ్యాష్‌ట్యాగ్ ట్విట్టర్‌లో ట్రెండ్ అవుతోంది. , జట్టు మేనేజ్‌మెంట్ రిజర్వ్ ప్లేయర్ స్నేహా దాస్‌ను జట్టులో చేర్చే అవకాశాలు పరిశీలిస్తోంది.

# భారత హాకీ శతాబ్దోత్సవం – లెజెండరీ ఎం.ఎం.

## సోమయ్య భావోద్వేగ వ్యాఖ్యలు



న్యూ ఢిల్లీ : భారత హాకీ 100 ఏళ్ల చరిత్రలో అత్యంత ప్రాధాన్యతగల ఘట్టంగా శతాబ్దోత్సవ వేడుకలు న్యూ ఢిల్లీలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా భారత హాకీ లెజెండ్ ఎం.ఎం. సోమయ్య పాల్గొని భావోద్వేగంగా మాట్లాడారు. "ఈ మైలురాయి కేవలం ఆటగాళ్లకే కాదు, దశాబ్దాలుగా హాకీ అభివృద్ధికి కృషి చేసిన కోచ్‌లు, నిర్వాహకులు, అభిమానులందరికీ చెందింది" అని ఆయన అన్నారు. సోమయ్య మాట్లాడుతూ, మహిళా హాకీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని సూచించారు. "దేశవ్యాప్తంగా ఉన్న ప్రతిభావంతులైన బాలికలకు తగిన అవకాశాలు ఇవ్వకపోతే మన భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కోలేము" అని ఆయన తెలిపారు. యువతలో క్రీడా ఆత్మను పెంపొందించేందుకు పాఠశాల స్థాయిలో హాకీ శిక్షణ తప్పనిసరి చేయాలని కూడా సూచించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఆటగాళ్లు, ప్రస్తుత జాతీయ జట్టు సభ్యులు, కేంద్ర క్రీడా శాఖ ప్రతినిధులు హాజరయ్యారు. హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్ తిర్కే మాట్లాడుతూ, "భారత హాకీ చరిత్రలో ఇది గర్వకారణమైన రోజు. వచ్చే సంవత్సరాల్లో మేము పునరుద్ధరణ దిశగా అడుగులు వేస్తాం" అని అన్నారు. వేడుకలో హాకీ చరిత్రను ప్రతిబింబించే ఫోటో ఎగ్జిబిషన్, పాత ఆటగాళ్ల సత్కారం, యువ ఆటగాళ్ల ప్రదర్శనలు చోటుచేసుకున్నాయి. హాకీ అభిమానులు ఈ వేడుకను సోషల్ మీడియాలో విస్తృతంగా పంచుకుంటూ భారత హాకీకి శుభాకాంక్షలు తెలియజేశారు.

# సీనియర్ మహిళల టీ20 ట్రోఫీ 2025-26 సీజన్ ప్రారంభం




హైదరాబాద్ : భారత దేశీయ మహిళా క్రికెట్‌లో అత్యంత ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌గా భావించే సీనియర్ మహిళల టీ20 ట్రోఫీ 2025 - 26 సీజన్ హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమైంది. ఈ సీజన్‌లో దేశంలోని 37 రాష్ట్ర జట్లు పాల్గొంటున్నాయి. భారత క్రికెట్ కంట్రోల్ బోర్డ్ (బీసీసీఐ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్ నవంబర్ మధ్య వరకు కొనసాగనుంది. ప్రారంభ మ్యాచ్‌లో తెలంగాణ జట్టు మధ్యప్రదేశ్‌పై ఆధిపత్యం చాటుకుంది. తెలంగాణ ఓపెనర్ సౌమ్య రెడ్డి అర్ధశతకం సాధించగా, బౌలింగ్ విభాగంలో సునీత కిరణ్ మూడు వికెట్లు పడగొట్టి జట్టుకు విజయం అందించింది. ప్రేక్షకులు స్థానిక జట్టు ప్రదర్శనపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సీజన్‌లో కొత్త నియమాలు అమల్లోకి వచ్చాయి. బ్యాటింగ్ పవర్‌ప్లే సమయంలో మూడవ ఫీల్డర్‌ను కూడా ఇన్‌సర్కిల్‌లో ఉంచే నిబంధన కొత్త ఉత్సాహం తెచ్చింది. ఆట వేగం పెంచేందుకు బీసీసీఐ టైమ్ లిమిట్ రూల్ కూడా కఠినంగా అమలు చేయనుంది. బీసీసీఐ మహిళల విభాగం అధికారి నీలిమా జోషి మాట్లాడుతూ, "ఈ టోర్నమెంట్ దేశీయ స్థాయిలో మహిళల క్రికెట్‌కు కొత్త దిశనిస్తుంది. ప్రతి రాష్ట్రం నుంచి ప్రతిభావంతులైన ఆటగాళ్లు వెలుగులోకి వస్తారు" అని తెలిపారు. సెమీఫైనల్స్ నవంబర్ మొదటి వారంలో జరుగుతాయి. ఫైనల్ మ్యాచ్ ముంబైలోని వాంఖడే మైదానంలో నిర్వహించనున్నారు. గత సీజన్ విజేత రైల్వేస్ జట్టు టైటిల్ రక్షణ కోసం సన్నద్ధమవుతుండగా, తమిళనాడు, మహారాష్ట్ర, తెలంగాణ జట్లు బలమైన పోటీని ఇవ్వనున్నాయి. దేశవ్యాప్తంగా మహిళల క్రికెట్‌పై పెరుగుతున్న ఆసక్తి దృష్ట్యా ఈ టోర్నమెంట్ కీలకంగా మారనుందని క్రీడా నిపుణులు భావిస్తున్నారు.

# నాగపూర్‌లో రూ.100 కోట్లతో నూతన క్రీడా హబ్ నిర్మాణం ప్రారంభం



నాగపూర్ : మహారాష్ట్ర రాష్ట్ర ప్రభుత్వం నాగపూర్‌లోని డివిజనల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను రాష్ట్ర స్థాయి క్రీడా హబ్‌గా అభివృద్ధి చేసేందుకు భారీ ప్రణాళికను ప్రారంభించింది. ఈ ప్రాజెక్ట్ కోసం రూ.100 కోట్ల నిధులు కేటాయించినట్లు రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వెల్లడించారు. ఈ నిధులతో ఆధునిక క్రీడా వసతులు, ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్, ఫుట్‌బాల్ గ్రౌండ్ మరియు ట్రైనింగ్ సెంటర్ల నిర్మాణం చేపట్టనున్నారు. ప్రస్తుత కాంప్లెక్స్ విస్తీర్ణాన్ని పెంచుతూ కొత్త మల్టీపర్పస్ అరేనా నిర్మించనున్నారు. అంతర్జాతీయ స్థాయి సదుపాయాలతో ఈ ప్రాజెక్ట్ పూర్తి అయితే, దేశీయ క్రీడాకారులకు శిక్షణ కేంద్రంగా నాగపూర్ నిలవనుంది. ఈ ప్రాజెక్ట్ పునాది వేడుకలో క్రీడాశాఖ మంత్రి మాట్లాడుతూ, "మహారాష్ట్రలో ప్రతి జిల్లాలో కనీసం ఒక ఆధునిక క్రీడా సముదాయం ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోంది. యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడానికి ఇది ఒక ముఖ్యమైన దశ" అని అన్నారు. క్రీడా సంఘాలు ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూ, "రాష్ట్ర స్థాయిలో కొత్త ప్రతిభావంతులు వెలుగులోకి రావడానికి ఇది గొప్ప అవకాశమవుతుంది" అని పేర్కొన్నాయి. స్థానిక క్రీడాకారులు ఈ హబ్ ద్వారా తమకు శిక్షణ, సౌకర్యాలు లభిస్తాయని సంతోషం వ్యక్తం చేశారు. నిర్మాణం వచ్చే ఏడాది మధ్య నాటికి పూర్తవుతుందని అధికారులు తెలిపారు. దీంతో నాగపూర్ క్రీడా రంగంలో కొత్త కేంద్రంగా మారనుంది.

# 2025-26 రంజీ ట్రోఫీ ఘనంగా ప్రారంభం




ముంబై : భారత దేశీయ క్రికెట్ ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్ రంజీ ట్రోఫీ 2025- 26 సీజన్ ఘనంగా ముంబైలో ప్రారంభమైంది. ఈ టోర్నమెంట్ అక్టోబర్ 25న ప్రారంభమై వచ్చే సంవత్సరం ఫిబ్రవరి వరకు కొనసాగనుంది. బీసీసీఐ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ సీజన్‌లో దేశంలోని 38 రాష్ట్ర జట్లు పాల్గొంటున్నాయి. ప్రారంభ మ్యాచ్‌లో ముంబై జట్టు బరోడాపై బలమైన స్థితిలో నిలిచింది. ముంబై కెప్టెన్ అజింక్య రహానే అర్ధశతకం సాధించి జట్టుకు శుభారంభం అందించాడు. బరోడా బౌలర్లు కష్టపడినా ముంబై టాప్ ఆర్డర్‌ను అడ్డుకోలేకపోయారు. టోర్నమెంట్‌లో తొలి రోజే పలు జట్ల మధ్య ఉత్కంఠభరిత పోటీలు చోటుచేసుకున్నాయి. ఢిల్లీ జట్టు ఉత్తరప్రదేశ్‌పై బలమైన ఆటతీరును ప్రదర్శించగా, తమిళనాడు జట్టు ఒడిశాపై ఆధిపత్యం చాటుకుంది. యువ బౌలర్లు అద్భుతమైన స్పెల్స్‌తో ఆకట్టుకున్నారు. బీసీసీఐ అధ్యక్షుడు రాజీవ్ శుక్లా ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతూ, "రంజీ ట్రోఫీ భారత క్రికెట్ పునాది. ఈ టోర్నమెంట్ ద్వారా అనేకమంది అంతర్జాతీయ ఆటగాళ్లు తయారయ్యారు. యువత ఈ వేదికను పూర్తిగా ఉపయోగించుకోవాలి" అని తెలిపారు. రంజీ ట్రోఫీ ఫార్మాట్ ప్రకారం, జట్లు నాలుగు జోన్‌లుగా విభజించబడ్డాయి. ప్రతి జట్టు లీగ్ దశలో ఆరు మ్యాచ్‌లు ఆడి, అత్యధిక పాయింట్లు సాధించిన జట్లు నాకౌట్ దశకు అర్హత సాధిస్తాయి. ఫైనల్ మ్యాచ్ ఫిబ్రవరి నెలలో బెంగళూరులో జరగనుంది. దేశీయ క్రికెట్ ప్రేమికులు ఈ సీజన్‌పై భారీ అంచనాలు పెట్టుకున్నారు. రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్ వంటి స్టార్ ఆటగాళ్లు తమ రాష్ట్ర జట్ల తరపున ఆడే అవకాశం ఉందని సమాచారం. దీంతో ఈ సీజన్ రంజీ ట్రోఫీ మరింత ఉత్కంఠభరితంగా మారనుంది.

# చెప్పులు లేకుండా నడవడమే ట్రెండ్..



పాటల విషయంలో, వస్తువుల విషయంలో, ఫుడ్ విషయంలో ఇలా చాలా విషయాల్లో కూడా ఓల్డ్ ఈజ్ గోల్డ్ అంటారు. ప్రస్తుతం ఎక్కడికి వెళ్లాలి అన్నా సరే ఇంటికి ఒక బైక్, లేదా కార్ వంటివి ఉన్నాయి. ఇక రోడ్డు మీద బస్ లు, రైల్వే ట్రాక్ లు, విమానాలు చాలా ఉన్నాయి. పైసామే పరమాత్మ అన్నట్టుగా డబ్బులను బట్టి లగ్జరీగా ఉండవచ్చు. కానీ పూర్వం మన భారత దేశంలో ఎవరు ఎక్కడికి వెళ్ళలను కున్నా కాళ్లతో నడుస్తూనే వెళ్లేవారు. మరి నడవడం వల్ల ఎన్ని ప్రయోజనాలు ఉన్నాయో తెలుసా? రాను రాను నడక పూర్తిగా తగ్గిపోయింది. కేవలం వాకింగ్, జాగింగ్ చేసేవారు మాత్రం పెరిగిపోతున్నారు.అయితే వీటికోసం కూడా ఎన్నోరకాల చెప్పులు, షూస్ అందుబాటులోకి వచ్చాయి.అవసరానికి అనుగుణంగా చెప్పులు, షూలు వచ్చాక డబ్బులు పెట్టి అందమైనవి కూడా కొంటున్నారు. ఇదిలా ఉంటే కాలి నడక ఇప్పుడు కొన్ని ప్రాంతాల్లో ట్రెండ్ గా మారింది. ఒక వ్రతం లాగా దీన్ని పాటిస్తున్నారు అంటే నమ్ముతారా?. కొందరు మార్నింగ్ వాక్ కోసం కాలి నడకని ఎంచుకుంటే.. మరికొందరు చెప్పులు లేకుండా నడవాలి అని కోరుకుంటున్నారు. మన దగ్గర ఇప్పటికే ఇలా చాలా మంది అలవాటు చేసుకున్నారు. ఆరోగ్యం కోసం చాలా మంది పాత పద్ధతులనే వాడుతున్నారు. ఇందులో భాగంగా చెప్పులు లేకుండా భూమి స్పర్శను పొందడం అనేది మెల్లిమెల్లిగా మన దేశంలో చాలా మంది అలవాటు చేసుకుంటున్నారు. సామాన్య ప్రజలు మాత్రమే కాదు ప్రముఖులు కూడా ఇదే పని చేస్తున్నారు. ఇప్పుడు కొంతమంది సెలబ్రిటీలు పాదాలతో నడవడం గమనిస్తే ఈ విషయం చాలా అర్థం అవుతుంది. ఇలా ఎవరు ఎక్కడ చెప్పులు లేకుండా నడిచినా వాటి ఉపయోగాలు మాత్రం చాలా ఉన్నాయి అంటున్నారు నిపుణులు. ప్రకృతి స్పర్శను అనుభవించాలి అంటే నేలను తాకాలట. నేల తగిలేలా కాలు కింద పెట్టి భూమికి ఉన్న రకరకాల స్వభావాలు తాకుతూ ఉంటే ప్రకృతితో ఒక బంధం ఏర్పడుతుంది అంటారు ప్రకృతి ప్రియులు. కాలి నడక వల్ల భూమిలోని నెగిటివ్ ఎనర్జీ శరీరంలోకి ప్రవేశిస్తాయి. మన నిత్యం వాడే ఎలక్ట్రానిక్ పరికరాల వల్ల శరీరంలో పేర్కొన్న అయాన్లను ఇవి బ్యాలెన్స్ చేస్తాయి అంటున్నారు నిపుణులు. ఇలా బ్యాలెన్స్ అవడం వల్ల శరీరంలో ఉన్న వాపులు తగ్గుతాయట. ఇలా జరగడం వల్ల నిద్ర కూడా బాగా పడుతుందట. చెప్పులు లేకుండా నడవడం వల్ల పాదాలలో ఉండే నరాలు క్రమబద్ధంగా తాకిడికి గురై దానివల్ల ఒత్తిడి దూరమయ్యే ఛాన్స్ కూడా ఉందట. శరీరం పూర్తిగా సేద తీరిన భావన కలుగుతుంది.ఇలా నడవడం వల్ల రక్త ప్రసరణ బాగా జరుగుతుందని చాలా అధ్యయనాలు చెబుతున్నాయి. పాదంపై ఒత్తిడి పెంచడం వల్ల రక్తప్రసరణలో చురుకుతనం వస్తుంది. తద్వారా గుండె ఆరోగ్యం కూడా పదిలంగా ఉంటుంది.

# సరైన నిద్ర లేదా?

## మీరు డేంజర్‌లో ఉన్నట్టే..



ప్రస్తుతం చాలా మంది నిద్రలేమి సమస్యతో బాధ పడుతున్నారు. నైట్ డ్యూటీలు, రాత్రి ఫోన్ లు, పార్టీలు అంటూ నిద్ర పోకుండా మెలుకువతో ఉంటున్నారు. దీని వల్ల తర్వాత కూడా నిద్ర పట్టడం లేదు. అయితే నిద్ర లేకపోవడం వల్ల, నిద్రలేమి సమస్య సులభంగా వస్తుంది. దీని వల్ల గుండె సమస్య కూడా వస్తుంది. అంతేకాదు మానసిక, శారీరక సమస్యలు.. సహా పలు తీవ్ర వ్యాధులకు కారణం కూడా అవుతుంది. వాస్తవానికి ఆరోగ్యంగా ఉండాలంటే.. 7 నుంచి 8 గంటలపాటు నిద్రపోవాలి.. మరి మీకు సరైనా నిద్ర లేకపోతే ఎలాంటి ప్రమాదాలు, వ్యాధులు వస్తాయో తెలుసుకోండి. ఎవరైనా 8 గంటలు నిద్రపోకపోతే, శరీరంలో కార్టిసాల్ హార్మోన్ పెరగడం ప్రారంభమవుతుంది అంటున్నారు నిపుణులు. దీంతో గుండెపై ఒత్తిడి పెరుగుతుందట. తద్వారా రక్తపోటు పెరిగి.. ఇది గుండె జబ్బులకు దారి తీస్తుంది. అంటే గుండెపోటు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. తగినంత నిద్ర లేకపోవడం వల్ల వాపు, ఒత్తిడిని పెంచే హార్మోన్లు శరీరంలో పెరుగుతాయి అంటున్నారు నిపుణులు. ఈ వాపు ధమనికి హాని కలిగిస్తుందట. దీని వల్ల కూడా గుండె జబ్బులు పెరుగుతాయట. నిద్ర లేకపోవడం వల్ల, గుండె కొట్టుకోవడం సక్రమంగా ఉండదని.. చప్పుడులో మార్పు సంభవించే ప్రమాదం ఉంది అంటున్నారు నిపుణులు. దీనిని అరిథ్మియా అని పిలుస్తారట. ఇది గుండెపోటు, స్ట్రోక్ ప్రమాదాన్ని పెంచుతుందని.. అందుకే రాత్రి పూట వీలైనంత త్వరగా పడుకోవాలి అని సలహా ఇస్తున్నారు వైద్యులు. రాత్రి పూట మెలుకువగా ఉంటే తినడం కూడా బాగా అలవాటు అవుతుంది. దీని వల్ల ఆకలి కూడా పెరుగుతుంది. ఇలా జరగడం వల్ల తినడం, ఆ తర్వాత ఉచితంగా ఊబకాయం రావడం వంటి సమస్యలు వస్తుంటాయి. గుండె జబ్బులకు ప్రధాన కారణం అధిక బరువు.. కావున జీవనశైలిలో మార్పు చేసుకుంటే ఈ గుండె జబ్బులు కూడా తక్కువ అవుతాయి.

# పొట్టని క్లీన్ చేసే హెల్తీ జ్యూస్లు..



పొట్ట ఆరోగ్యం చాలా ముఖ్యం. పొట్ట ఆరోగ్యంగా ఉంటే ఎలాంటి సమస్యలు రావు. పొట్ట ఆరోగ్యంగా ఉండాలంటే ఖచ్చితంగా కొన్ని హెల్తీ జ్యూస్ లు తాగాలి. ఇది అనేక రకాల పనులను నిర్వర్తిస్తుంది. పిత్త రసాన్ని ఉత్పత్తి చేస్తుంది. రక్తాన్ని శుభ్ర పరుస్తుంది.అవేంటో ఇప్పుడు మనం తెలుసుకుందాం.పాలకూరలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి లివర్‌ను డిటాక్సిఫై చేస్తాయి. యాంటీ ఆక్సిడెంట్లు లివర్‌ను కాపాడుతాయి. అలాగే శరీరాన్ని శుభ్ర పరుస్తాయి. కనుక రోజూ పాలకూర జ్యూస్‌ను కూడా తాగవచ్చు. అయితే ఇందులో నిమ్మరసం కలిపి తాగాల్సి ఉంటుంది. ఇక రోజూ నెయ్యిని తీసుకుంటున్నా కూడా లివర్ శుభ్రంగా మారుతుంది. నెయ్యిలో యాంటీ ఇన్‌ఫ్లామేటరీ లక్షణాలు ఉంటాయి. అందువల్ల లివర్ వాపులకు గురి కాకుండా చూస్తాయి. లివర్‌ను ఆరోగ్యంగా ఉంచుతాయి.క్యారెట్ జ్యూస్ లివర్‌కు చాలా మేలు చేస్తుంది. క్యారెట్లలో బీటా కెరోటిన్ ఉంటుంది. ఇది మన శరీరంలో విటమిన్ ఎ గా మారుతుంది. ఇది లివర్‌కు ఉపయోగకరంగా ఉంటుంది. ఇది లివర్‌ను దెబ్బ తినకుండా చూస్తుంది. జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. శరీరాన్ని డిటాక్సిఫై చేస్తుంది. ఇక బీట్‌రూట్ జ్యూస్‌ను తాగినా కూడా లివర్ ఆరోగ్యంగా మారుతుంది. ఇందులో పొటాషియం, ఫైబర్, మాంగనీస్, విటమిన్ ఎ, సి ఉంటాయి. బీట్‌రూట్‌లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు రక్తాన్ని శుభ్రం చేస్తాయి. లివర్‌ను ఆరోగ్యంగా ఉంచుతాయి. కనుక రోజూ బీట్‌రూట్ జ్యూస్‌ను తాగినా కూడా లివర్ శుభ్రంగా ఉంటుంది.జీర్ణక్రియలను సజావుగా నిర్వహిస్తుంది. శరీరంలో అవసరమైన విటమిన్లు, మినరల్స్‌ను నిల్వ చేయడంలో సహాయం చేస్తుంది. ఆహారం సరిగ్గా తీసుకోకపోయినా లేదంటే అస్తవ్యస్తమైన జీవనశైలి అయినా లివర్ దెబ్బ తింటుంది. ఈ క్రమంలోనే దెబ్బ తిన్న లివర్‌ను మళ్లీ పునరుద్ధరించాలి. లేదంటే ఇబ్బందులు వస్తాయి. ఇక లివర్‌ను ఆరోగ్యంగా ఉంచేందుకు పైన తెలిపిన కూరగాయలు, ఆకుకూరల జ్యూస్లు ఎంతగానో ఉపయోగపడతాయి. వీటిని తీసుకోవడం వల్ల లివర్‌ను ఆరోగ్యంగా ఉంచవచ్చు. ఇవి శరీరం నుంచి విషాన్ని బయటకు పంపిస్తాయి. కాలేయాన్ని బాగా శుభ్రపరుస్తాయి

# ఈ ఆకులు తింటే మోకాళ్ల నొప్పులు దెబ్బకి పరార్..!



చాలామంది ఆయుర్వేద నిపుణులు ఎక్కువగా మన చుట్టూ ఉంటే పరిసరాలలో లభించే మొక్కల ద్వారా ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని వాటిని ఉపయోగిస్తూ ఉంటారు. అయితే కొన్ని మొక్కల ఆకులను తినడం వల్ల యూరిక్ యాసిడ్ వంటి సమస్యలను కూడా తగ్గించుకోవచ్చని నిపుణులు సైతం తెలియజేస్తూ ఉంటారు.అలా ఇప్పుడు మోకాళ్ళ నొప్పులతో బాధపడేటువంటి వారు కొన్ని ఆకులు తినడం వల్ల మోకాళ్ల నొప్పుల నుంచి విముక్తి పొందవచ్చు వాటి గురించి చూద్దాం.యూరిక్ యాసిడ్ వల్ల కిడ్నీల పైన తీవ్రమైన ప్రమాదం చూపిస్తుంది.. దీనివల్ల కిడ్నీలు సరిగా ఫిల్టర్ చేయలేకపోతాయట. అంతేకాకుండా పొత్తి కడుపులో నొప్పి, మోకాళ్ల నొప్పులు, జ్వరం, మూత్ర విసర్జనలు ఇబ్బందులు ఇవే యూరిక్ యాసిడ్ యొక్క లక్షణాలు వీటిని తగ్గించుకోవాలి అంటే.. తులసి చెట్టు ఆకులలో చాలా ఔషధ గుణాలు లభిస్తాయి.. తులసి ఆకులను తరచూ నమిలి తింటూ ఉండడం వల్ల రీజనల్ వ్యాధులను కూడా దరిచేరకుండా చేస్తుంది. అలాగే యూరిక్ యాసిడ్ కూడా చెక్ పెట్టవచ్చు. కొత్తిమీర ఇది మనకు ఎక్కడైనా సరే అందుబాటులో లభిస్తుంది. కొత్తిమీరలో ఎన్నో రకాల ఆరోగ్య సమస్యలని తగ్గించుకోవచ్చు. కొత్తిమీరలో ఉండే ఔషధ గుణాలు కూడా యూరిక్ యాసిడ్ని తగ్గించడానికి చాలా ఉపయోగపడతాయి. అలాగే కొత్తిమీర తినడం వల్ల రక్త శుద్ధి అవుతుంది విష పదార్థాలు కూడా బయటికి వెళ్లిపోతాయి. కొత్తిమీర రసం లేదా నమిలి తిన్నా కూడా ఆరోగ్యానికి చాలా మంచిదని నిపుణులు తెలియజేస్తున్నారు. వేప ఆకులలో లేదా వేపకాయలలో మెడిసిన్ గుణాలు చాలా పుష్కలంగా ఉన్నాయి. అందుకే పూర్వపు రోజుల్లో వీటిని ఎన్నో రకాలుగా ప్రజలు ఉపయోగించేవారు. ఎవరికైనా యూరిక్ యాసిడ్ లక్షణాలు కనిపిస్తే వేప ఆకుల ద్వారా వాటిని తగ్గించుకోవచ్చు వేప ఆకులను నమిలి తినడం వల్ల రక్తాన్ని శుద్ధి చేయడమే కాకుండా శరీరంలో ఉండే విషయాన్నీ కూడా బయటికి పంపించాలా చేస్తుంది.

# ఆపిల్స్

## తీసుకునేటప్పుడు జాగ్రత్త..



ఆరోగ్యంగా ఉండాలంటే రోజుకు ఒక ఆపిల్ తినాలి అంటారు నిపుణులు. దీనిలో చాలా పోషకాలు ఉంటాయి. కొందరు ఏకంగా వీటిని బ్రేక్‌ఫాస్ట్‌లో తింటారు. ఆపిల్స్ లో ఎక్కువగా ఫైబర్, విటమిన్స్ ఉంటాయి. ఇవి శరీరాన్ని ఎన్నో సమస్యల నుంచి కాపాడుతుంటాయి. అంతేకాదు రోగనిరోధక శక్తిని కూడా పెంచుతాయి. కానీ ఆపిల్స్ కదా అని ఏవి పడితే అవి తినకూడదు. చూసి మంచివి తీసుకోవాలి. సరైనవి తింటేనే ఆరోగ్యానికి చాలా మంచిది. ఇంతకీ మంచి వాటిని ఎలా గుర్తించాలో తెలుసా? ఓ సారి చూసేయండి..రుచికరమైన ఆపిల్స్ తినాలి అనిపిస్తే కొనేటప్పుడు అవి చిన్న పరిమాణంలో, సాధారణ బరువు ఉండేలా చూడండి. ఎందుకంటే, పెద్దగా ఉండే యాపిల్స్ త్వరగా చెడిపోయే అవకాశం ఉంటుంది. అదే విధంగా, ఎక్కువగా బరువుగా ఉండే ఆపిల్స్ కూడా మంచివి కాదంటారు నిపుణులు.ఆపిల్స్ సాధారణంగా ఎరుపు, లేత పసుపు, ఆకుపచ్చ రంగుల్లో లభిస్తుంటాయి. చాలా మంది రెడ్ కలర్ ఆపిల్స్‌కి అట్రాక్ట్ అవుతుంటారు. కానీ, లేత ఎరుపు, ఆకపచ్చ, మిక్స్ కలర్ ఆపిల్స్ రెడ్ కలర్ ఆపిల్స్ కంటే తియ్యగా, రుచిగా ఉంటాయి కాబట్టి వీటికే ఎక్కువ ఓటు వేస్తారు. ఆకుపచ్చ ఆపిల్స్ పచ్చిగా ఉండటమే కాదు కాస్తా పుల్లగా కూడా ఉంటాయి. పసుపు రంగులో ఉండే ఆపిల్స్ తియ్యగా ఉంటాయి. జ్యూస్ కు కూడా ఇవి బాగుంటాయి. వాసన చూడటం వల్ల కూడా ఆపిల్స్ బాగున్నాయో లేదో తెలుసుకోవచ్చు. స్వీట్ ఆపిల్ అయితే మంచి వాసన వస్తుంది అంటారు నిపుణులు. వాసన సరిగా రాకపోతే వాటిని తీసుకోకూడదు. అయితే, కొన్ని సందర్భాల్లో యాపిల్ వాసన చూసి రుచిని గెస్ చేయడం కూడా కష్టం కావచ్చు. ఓ పండు బాగుందా లేదా అనేది వాటిని చూసి తీసుకోవడంలో కొందరు ఎక్స్ పర్ట్ లు ఉంటారు. వాటిని తాకినప్పుడు గీతలు, చారలు కనిపిస్తుంటాయి. అదే విధంగా కనిపించని మచ్చలు కూడా వాటిని తాకినప్పుడు తెలుస్తుంటాయి. కాబట్టి అలాంటి వాటిని కొనొద్దు.

# పుదీనాతో మొటిమలకు చెక్..



పుదీనా అనేది వేసవిలో ఎక్కువగా ఉపయోగించే ఓ ఔషధం. ఇది ఆహారంలో సువాసన, రుచిని పెంచడమే కాకుండా ఆరోగ్య పరంగా కూడా ఎన్నో ఉపయోగాలను కలిగిస్తుంది.ఇందులో ఉండే చల్లదనం కారణంగా వేసవిలో దీన్ని ఎక్కువగా ఉపయోగిస్తారు. అందుకే చాలామంది ప్రజలు ఖచ్చితంగా తమ వేసవి ఆహారంలో పుదీనాను చేర్చుకుంటారు. అయితే ఇది ఆరోగ్యంతో పాటు మన చర్మానికి కూడా మేలు చేస్తుంది. అలాగే జిడ్డుగల చర్మం లేదా తీవ్రమైన మొటిమల సమస్యలు ఉన్నవారికి పుదీనా చాలా ఉపయోగకరంగా ఉంటుంది. పుదీనాలో క్రిమినాశక లక్షణాలు కనిపిస్తాయి. అందుకే దీన్ని సబ్బు, బ్యూటీ క్రీమ్, క్లెన్సర్ వంటి చర్మ సంరక్షణ ఉత్పత్తులలో ఉపయోగిస్తారు. మీ ముఖం పై పదేపదే మొటిమలు వస్తున్నట్లయితే, మీరు పుదీనాను ఉపయోగించడం ద్వారా ఈ సమస్యకు చెక్ పెట్టవచ్చు. పుదీనాలో మెంథాల్ ఉంటుంది. ఇది శీతలీకరణ లక్షణాలను కలిగి ఉంటుంది. ఈ మూలకం మొటిమలతో సంబంధం ఉన్న ఎరుపు, వాపును తగ్గించడంలో సహాయపడుతుంది. అంతే కాకుండా చర్మం పై మొటిమలకు కారణమయ్యే బ్యాక్టీరియాతో పోరాడే యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు పుదీనాలో ఉన్నాయి. దీనితో పాటు, ఫ్రీ రాడికల్స్‌తో పోరాడడంలో కూడా పుదీనా సహాయపడుతుంది. మొటిమలు, దాని మచ్చలతో ఇబ్బంది పడుతుంటే, పుదీనా, పసుపును ఉపయోగించవచ్చు. 10 నుంచి 15 పుదీనా ఆకులను మిక్స్ చేసి పేస్ట్ లా తయారు చేయండి. దీని తరువాత దానికి చిటికెడు పసుపు వేసి కలపాలి. ఇప్పుడు నీళ్లతో ముఖం కడుక్కుని ప్యాక్ వేసుకోవాలి. సుమారు 15 నిమిషాల తర్వాత మీ ముఖాన్ని కడగాలి. పుదీనా, ముల్తానీ మిట్టి ఫేస్ ప్యాక్ మొటిమల మొటిమలకు కూడా చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఇది ముఖంలోని మురికిని శుభ్రపరుస్తుంది. ఈ ఫేస్ ప్యాక్ చేయడానికి, పుదీనా ఆకులను తీసుకొని దాని పేస్ట్ సిద్ధం చేయండి. ఈ పేస్ట్‌లో పెరుగు, ముల్తానీ మిట్టి వేసి కలపాలి. దీన్ని ముఖం, మెడ పై మాస్క్ లాగా అప్లై చేయండి. అది ఆరిన తర్వాత ముఖానికి మసాజ్ చేసి కడిగేయాలి

# వేడి పాలుతాగుతున్నారా?




పాలు అంటే ఇష్టపడని వారు ఎవరు ఉంటారు. చాలా మంది ఉదయం లేవగానే పాలు తాగుతుంటారు. ఇందులో చాలా పోషకాలు ఉంటాయి కూడా. పాలు తాగడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయి.ముఖ్యంగా పాలు తాగడం వల్ల ఎముకలకు బలం అంటారు నిపుణులు. ఇందులో ఉండే కాల్షియమే దీనికి ప్రధాన కారణం. అయితే వేసవిలో పాలు తాగితే వేడి అంటారు కొందరు. అందుకే వేసవి లో పాలు తాగడమే మానేస్తుంటారు. ఇంతకీ ఎండాకాలంలో పాలు తాగవచ్చా లేదా? అనే వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం. పాల వల్ల అసిడిటీ కలుగుతుందట. అందుకే ఖాళీ కడుపున పాలు తాగవద్దు అంటారు నిపుణులు. ఖాళీ కడుపుతో పాలు తాగాలి అనుకుంటే ఖచ్చితంగా దానితో ఏదైనా నట్స్ తినండి. దీని వల్ల మీ కండరాలను బలంగా మారుతాయి. ఇక వేసవిలో, చల్లని పాలు తాగడం అలవాటు చేసుకోండి. ఎందుకంటే వేడి పాలు తాగడం వల్ల కడుపు సంబంధిత సమస్యలు వస్తాయి అంటున్నారు నిపుణులు. అందుకే వేసవిలో వేడి పాలకు బదులుగా చల్లని పాలు అలవాటు చేసుకోవాలి. దీని వల్ల శరీరం చల్లగా ఉంటుంది. ఇక చలికాలంలో గోరువెచ్చని పాలు తాగవచ్చు.ఇక చాలా మంది వ్యాయామం, వర్కౌట్లు చేసిన తర్వాత లేదంటే ముందు పాలు తాగుతుంటారు. ఇలా చేయవద్దు అంటున్నారు నిపుణులు. అలా కాకుండా వ్యాయామం పూర్తైన అరగంట తర్వాత మాత్రమే పాలు తాగాలట. దీంతో శరీరానికి పోషకాలు అందుతాయి. జలుబు లేదా ఫ్లూ వంటి సమస్యలు ఉంటే చల్లని పాలు తాగకుండా గోరువెచ్చని, వేడి పాలు తాగాలి. దీంతో మీరు గొంతు నొప్పి నుండి ఉపశమనం పొందుతారు. కొందరికి పడుకునే ముందు పాలు తాగే అలవాటు ఉంటుంది. అయితే చలికాలంలో మాత్రం గోరువెచ్చిన పాలనే తాగాలి. ఇది శరీరాన్ని వెచ్చగా ఉంచడంలో సహాయం చేస్తుంది. చలి నుండి రక్షిస్తుంది. వేడి పాలు జీర్ణ సమస్యలు, కడుపు నొప్పి, గ్యాస్ నుంచి దూరంగా ఉంచుతాయి. నిద్రలేమి ఉంటే, రాత్రిపూట గోరువెచ్చని పాలు తీసుకోవడం వల్ల నిద్ర వస్తుందట. పాలలో ఉండే అమినో యాసిడ్లు సెరోటోనిన్ , మెలటోనిన్‌లను నియంత్రించి నిద్ర పోయేలా చేస్తాయి పాలు.




# చలన చిత్రం

## 'కాంతార: చాప్టర్ 1'పై అల్లు అర్జున్ 'మైండ్ బ్లోయింగ్' రివ్యూ!






భారతీయ చలనచిత్ర పరిశ్రమలో సంచలనం సృష్టిస్తున్న చిత్రాలలో ఒకటైన లిలి'కాంతార: చాప్టర్ 1'లిలిపై ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన ప్రశంసల వర్షం కురిపించారు. రిషబ్ శెట్టి రచించి, దర్శకత్వం వహించి, నటించిన ఈ కన్నడ చిత్రంపై అల్లు అర్జున్ అద్భుతమైన రివ్యూ ఇచ్చారు. "నిన్న రాత్రి చూశాను. వావ్, ఎంతటి మైండ్-బ్లోయింగ్ సినిమా! ఆ సినిమా చూస్తున్నంత సేపు నేను ఒక ట్రాన్స్‌లో ఉన్నాను," అంటూ అల్లు అర్జున్ తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేశారు. ఈ చిత్రం అందించిన విజువల్స్, భావోద్వేగాలు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని తెలిపారు. ముఖ్యంగా, ఈ సినిమాకు సంబంధించి దర్శకుడు, నటుడు రిషబ్ శెట్టి ప్రదర్శించిన బహుముఖ ప్రతిభను అల్లు అర్జున్ ప్రత్యేకంగా అభినందించారు. ఒకే వ్యక్తి రచయితగా, దర్శకుడిగా, నటుడిగా మూడు పాత్రలలో అద్భుతంగా రాణించడాన్ని ప్రస్తావిస్తూ, "రచయితగా, దర్శకుడిగా, నటుడిగా వన్-మ్యాన్ షో చేసినందుకు రిషబ్ శెట్టి గారికి హృదయపూర్వక అభినందనలు. ఆయన ప్రతి కళలోనూ రాణించారు," అని కొనియాడారు. సినిమాలోని రిషబ్ శెట్టి నటన, ఆయన విజన్, సినిమాను తీర్చిదిద్దిన విధానం తనను ఎంతగానో ప్రభావితం చేశాయని ఆయన పేర్కొన్నారు. రిషబ్ శెట్టితో పాటు, చిత్ర బృందంలోని ఇతర నటీనటులైన రుక్మిణి వసంత, జయరామ్, గుల్షన్ దేవయ్య తదితరుల నటన కూడా అద్భుతంగా ఉందని అల్లు అర్జున్ తెలిపారు. సాంకేతిక నిపుణుల పనితీరును ప్రశంసిస్తూ, ముఖ్యంగా సంగీత దర్శకుడు బి. అజనీష్ లోక్‌నాథ్ మరియు సినిమాటోగ్రాఫర్ అరవింద్ ఎస్. కశ్యప్ల కృషిని ప్రత్యేకంగా మెచ్చుకున్నారు. ఈ సాంకేతిక అంశాలు సినిమా అనుభూతిని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాయని, కథకు ప్రాణం పోశాయని ఆయన వివరించారు. చివరిగా, అల్లు అర్జున్ నిర్మాత విజయ్ కిరగందూర్ మరియు హెూంబలే ఫిలింస్ బృందానికి పెద్ద అభినందనలు తెలిపారు. "నిజాయితీగా చెప్పాలంటే, ఈ అనుభవాన్ని వర్ణించడానికి మాటలు చాలవు. చాలా ప్రేమ, ఆరాధన మరియు గౌరవం" అంటూ అల్లు అర్జున్ తన సందేశాన్ని ముగించారు. ప్రభాస్ మరియు యష్ వంటి స్టార్ హీరోల నుండి ఇప్పటికే ప్రశంసలు అందుకున్న 'కాంతార: చాప్టర్ 1'కు, ఇప్పుడు అల్లు అర్జున్ రివ్యూతో దేశవ్యాప్తంగా మరింత గుర్తింపు లభించింది.

## సౌత్ సినిమాల ఎదుగుదల సంతోషకరం: నటి ప్రియమణి



దక్షిణాది సినిమాల ఎదుగుదల, వాటిని ప్రేక్షకులు ఆదరిస్తున్న తీరుపై ప్రముఖ నటి ప్రియమణి సంతోషం వ్యక్తం చేశారు. ఇటీవల ఒక మీడియా ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, వివిధ భాషల్లోని కంటెంట్‌ను స్వీకరించడానికి ప్రేక్షకులు మరింత సుముఖంగా ఉన్నారని ఆమె తెలిపారు. "చివరకు ప్రజలు దక్షిణాది సినిమాలను చూస్తున్నందుకు, ప్రాంతీయ భాషల్లో రూపొందించిన చిత్రాలను అంగీకరిస్తున్నందుకు నేను సంతోషిస్తున్నాను. ఇది ఎప్పుడూ ఉండేదే, కానీ అప్పట్లో దీనికి అంత ప్రాముఖ్యత లభించలేదు," అని ప్రియమణి అన్నారు. ప్రస్తుతం ఈ మార్పును గమనించడం చాలా ఆనందంగా ఉందని ఆమె పేర్కొన్నారు. సినిమాలతో పాటు, చిత్ర పరిశ్రమలోని మొత్తం వ్యవస్థకు ఈ ఆదరణ విస్తరించిందని ప్రియమణి అభిప్రాయపడ్డారు. "ప్రతి భాషలో అద్భుతమైన సినిమాలు వచ్చాయిబీ వాటి గురించి ఇంతకు ముందు మాట్లాడేవారు కాదు. కానీ ఇప్పుడు మాట్లాడుతున్నారు, అది చాలా గొప్ప విషయం. కేవలం సినిమాల గురించే కాకుండా, సాంకేతిక నిపుణులు, నటులు, దర్శకుల గురించి కూడా చర్చ జరుగుతోంది," అని ఆమె వివరించారు. ఈ మార్పు కేవలం ఒక ప్రాంతానికే పరిమితం కాకుండా, మొత్తం పరిశ్రమకు మేలు చేస్తుందని ఆమె అన్నారు. ప్రాంతీయ మరియు హిందీ సినిమా మధ్య సరిహద్దులు చెరిగిపోతున్నాయని ప్రియమణి ఆశాభావం వ్యక్తం చేశారు. "ఆ సరిహద్దులు కొంతవరకు మసకబారుతున్నాయని నేను భావిస్తున్నాను, మరియు అవి ఏదో ఒక రోజు పూర్తిగా చెరిగిపోవాలని నేను ఆశిస్తున్నాను," అని ఆమె అన్నారు. భాషా భేదాలు లేకుండా, మంచి కంటెంట్‌ను దేశవ్యాప్తంగా ఆదరించడం అనేది ఆరోగ్యకరమైన పరిణామమని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. సినిమా మరియు వేదికలపై పనిచేయడం మధ్య ఉన్న తేడాను గురించి కూడా ప్రియమణి ఈ సందర్భంగా పంచుకున్నారు. మెయిన్‌స్ట్రీమ్ సినిమాలో ఒకే రకమైన పాత్రలకు పరిమితమయ్యే అవకాశం ఉంటుందని, కానీ (ఓటీటీ) కంటెంట్‌లో ప్రయోగాలు చేయడానికి మరియు వైవిధ్యమైన పాత్రలు పోషించడానికి ఎక్కువ అవకాశం ఉంటుందని ఆమె అన్నారు. మొత్తానికి, దక్షిణాది చిత్రాలకు వస్తున్న ఆదరణ పట్ల ఆమె తన సంతోషాన్ని, పరిశ్రమలో వస్తున్న మార్పుల పట్ల తన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

## 'దేవర'లో జాన్వీ కపూర్ 'తంగమ్'గా: డీ-గ్లామరస్ పాత్రలో తొలి తెలుగు ఎంట్రీ!




బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ టాలీవుడ్‌లో తొలిసారిగా అడుగుపెడుతున్న చిత్రం జూనియర్ ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతున్న భారీ చిత్రం 'దేవర'. ఈ సినిమా నుండి ఆమె పాత్రకు సంబంధించిన ఆసక్తికరమైన అప్‌డేట్ వెలువడింది. ఈ చిత్రంలో ఆమె పోషిస్తున్న పాత్ర పేరు 'తంగమ్' అని తెలుస్తోంది, దీనికి 'బంగారం' అని అర్థం. జాన్వీ కపూర్ ఒక శక్తివంతమైన మరియు డీ-గ్లామరస్ పాత్రతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం కానుండటం విశేషం. 'దేవర' చిత్రం దేశంలో విస్మరణకు గురైన తీర ప్రాంతాల నేపథ్యంతో రూపొందుతున్నట్లు సమాచారం. ఈ చిత్ర కథాంశం ప్రకారం, జాన్వీ కపూర్ ఒక మురికివాడ బస్తీలో జీవనం సాగించే యువతి పాత్రలో కనిపించబోతున్నారు. ఆమె పాత్ర స్వభావం దృష్ట్యా, కొన్ని సన్నివేశాలలో ఆమె డీ-గ్లామరస్‌గా కనిపించాల్సి ఉంటుంది. సాధారణంగా గ్లామరస్ పాత్రలకే ప్రాధాన్యత ఇచ్చే జాన్వీ, తన తొలి తెలుగు సినిమాతోనే ఇంతటి ఛాలెంజింగ్ మరియు డీ-గ్లామరస్ రోల్‌ను ఎంచుకోవడం ఆమె పాత్రకు ఉన్న ప్రాధాన్యతను సూచిస్తుంది. జాన్వీ కపూర్ ఈ పాత్ర కోసం ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. పాత్ర యొక్క వేషధారణ, శరీర భాషతో పాటు, తెలుగు భాష యొక్క ఉచ్ఛారణలో స్పష్టత ఉండేలా ఆమె ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారట. ఇది కేవలం ఒక గ్లామర్ పాత్ర కాకుండా, కథాగమనంలో ముఖ్యమైన పాత్రగా ఉంటుందని సినీ వర్గాల సమాచారం. జాన్వీ పాత్రకు సంబంధించిన లోతు ఈ సినిమాలో హైలైట్ కానుందని మేకర్స్ చెబుతున్నారు. నందమూరి కళ్యాణ్ రామ్ సమర్పణలో మిక్కిలినేని సుధాకర్, కె. హరికృష్ణ నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. 'దేవర' మొదటి భాగం అక్టోబర్ 10న విడుదల కానుంది. ఎన్టీఆర్ సరసన జాన్వీ కపూర్ నటిస్తున్న ఈ చిత్రం, దేశవ్యాప్తంగా అంచనాలను భారీగా పెంచింది. ఈ డీ-గ్లామరస్ పాత్రలో జాన్వీ నటన చూడటానికి అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## గాంధారి'లో తాప్సీ తెగువ

### - డూప్ లేకుండా యాక్షన్ సీన్స్, రివెంజ్ డ్రామా

బాలీవుడ్‌లో వైవిధ్యమైన పాత్రలను ఎంచుకుంటూ, తన నటనకు ప్రాధాన్యతనిచ్చే నటిగా పేరుగాంచిన తాప్సీ పన్ను, తన తాజా చిత్రం 'గాంధారి' కోసం మరోసారి సరికొత్త యాక్షన్ అవతార్‌లో కనిపించబోతున్నారు. కిడ్నాప్ అయిన తన కుమార్తెను కాపాడుకోవడం కోసం ఒక తల్లి చేసే సాహసాలు, పడే పోరాటమే ఈ రివెంజ్ డ్రామా యొక్క ప్రధాన కథాంశం. ఈ చిత్రంలో యాక్షన్ సన్నివేశాలు చాలా ఎక్కువ మొత్తంలో ఉండగా, తాప్సీ వాటిని మరెవరి సహాయం లేకుండా, అంటే డూప్ (బాడీ-డబుల్) లేకుండా స్వయంగా చేశారు. ఈ సన్నివేశాలు సహజంగా మరియు శక్తివంతంగా కనిపించాలనే ఉద్దేశంతోనే ఆమె ఈ సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నట్లు చిత్ర బృందం తెలిపింది., దేవాశిష్ మఖీజా దర్శకత్వంలో మరియు కనికా ధిల్లాన్ రచన, నిర్మాణంలో రూపొందుతున్న ఈ చిత్రం తల్లి-బిడ్డల మధ్య ఉన్న లోతైన బంధాన్ని, ఒక తల్లి తన బిడ్డ కోసం ఎంత దూరం వెళ్లగలదో అనే అంశాన్ని చాలా శక్తివంతంగా చూపిస్తుంది. ఈ సినిమాలో తాప్సీ ఒక ఉగ్రరూపం దాల్చిన, దృఢ నిశ్చయం గల తల్లి పాత్రలో కనిపిస్తారు. తాప్సీ ఈ సినిమా గురించి మాట్లాడుతూ, ఇది కేవలం మానసికంగానే కాక, శారీరకంగా కూడా చాలా డిమాండింగ్ అయిన ప్రాజెక్ట్ అని తెలిపారు. ఎన్నో సవాళ్లను ఎదుర్కొని, ఒక కొత్త నటుడిలా ప్రతి షాట్‌కు తన శక్తిని మొత్తం ధారపోసినట్లు ఆమె చెప్పారు. ఈ యాక్షన్-థ్రిల్లర్ చిత్రం యొక్క షూటింగ్ ఇప్పటికే పూర్తయింది. షూటింగ్ పూర్తయిన సందర్భంగా, కష్టపడి పనిచేయడం వల్ల కలిగిన శారీరక గాయాల గురించి ప్రస్తావిస్తూ, "కొన్ని గాయాలు మునుపెన్నడూ లేని సంతృప్తిని ఇస్తాయి" అని తాప్సీ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. 'గాంధారి' చిత్రం థియేటర్లలో కాకుండా, ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ అయిన నెట్‌ఫ్లిక్స్ ద్వారా ప్రేక్షకులకు అందుబాటులోకి రానుంది. ఈ సంవత్సరంలోనే ఈ సినిమా ఓటీటీలో విడుదలయ్యే అవకాశం ఉందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ చిత్రంలో ఇష్వాక్ సింగ్ కూడా ఒక ముఖ్య పాత్రలో నటిస్తున్నారు. మొత్తం మీద, డూప్ లేకుండా యాక్షన్ సీక్వెన్స్‌లలో నటించిన తాప్సీ యొక్క తెగువ, మరియు ఒక తల్లి పోరాటంతో కూడిన కథాంశం 'గాంధారి' చిత్రంపై ప్రేక్షకులలో భారీ అంచనాలను పెంచింది. ఈ సినిమా తాప్సీ కెరీర్‌లో మరో బలమైన పాత్రగా నిలిచిపోతుందని భావిస్తున్నారు.



Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 8-358, Abdullapurmet, Rangareddy Dist-501505, Hyderabad, Telangana State.
Printed at **GPR PUBLICATIONS**. H.No. 8-358, Abdullapurmet, Rangareddy Dist-501505, Hyderabad, Telangana State, Associate Editor: **KAVITHA PRUDHVIRAJ**,
RNI: TELTEL/2022/83798, Cell:9581442622 Email: aksharavelugudaily@gmail.com, Website: www.aksharavelugu.com